

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 08-11-2025 | సంపుటి - 25 | సంచిక -173 | రూ : 4 | పేజీలు: 8




2లో

## జై షా జోక్యంతో...
## ప్రతీక రావల్ కు
## అందిన వరల్డ్ కప్ విన్నర్ మెడల్

- భారత క్రికెటర్ ప్రతీక రావల్‌కు 2025 వన్డే ప్రపంచకప్ పతకం
- గాయం కారణంగా ఫైనల్ మ్యాచ్‌కు దూరమైన ప్రతీక
- ఐసీసీ నిబంధనల ప్రకారం ఫైనల్ స్క్వాడ్‌కు మాత్రమే పతకాలు
- ఐసీసీ చైర్మన్ జై షా ప్రత్యేక చొరవతో అదనపు పతకం

## అడ్డగోలుగా ఫీజులు పెంచుతున్నారు..
# బకాయిలు ఈరోజు కాకుంటే రేపు వస్తాయి

**: కాలేజీలపై రేవంత్ రెడ్డి ఆగ్రహం**



2లో

- మా హయాంలో బకాయిలు ముందుగా చెల్లిస్తామని వెల్లడి
- విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దని విజ్ఞప్తి
- కాలేజీలు బంద్ పెడితే విద్యార్థులు కోల్పోయిన సమయం తిరిగి వస్తుందా అని నిలదీత
- వచ్చే ఆదాయంతో రాష్ట్రాన్ని ఎలా నడపాలని ప్రశ్న



2లో

ఎవరెన్ని గిమ్మిక్కులు చేసినా

## గెలుపు మాగంటి సునీతదే

- భాజపా అటెన్షన్ డైవర్షన్ రాజకీయాలు చేస్తోంది
- రేవంత్‌కు దమ్ముంటే 24 నెలల పాలన చూపించి ఓట్లు అడగాలి: కేటీఆర్



2లో

## విశాఖ నేవీ గూఢచర్యం కేసులో
# మరో ఇద్దరికి జైలు శిక్ష

- నిందితులకు ఐదేళ్ల 10 నెలల జైలు విధించిన ఎన్ఐఏ కోర్టు
- విశాఖ వాసి కొండబాబు, హిమాచల్ ప్రదేశ్ వాసి సోమల్‌కు శిక్ష
- పాకిస్తాన్ గూఢచార సంస్థకు సమాచారం లీక్ చేశారన్న ఆరోపణలు
- ఫేస్‌బుక్ ద్వారా పరిచయం, డబ్బు తీసుకుని సమాచారం చేరవేత
- ఈ కేసులో ఇప్పటివరకు ఆరుగురికి శిక్ష పడిందని తెలిపిన ఎన్ఐఏ



## రేవంత్ రెడ్డిపై వ్యాఖ్యలు..
## బండి సంజయ్‌పై
## ఈసీకి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్

- పీసీసీ ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఈసీకి ఫిర్యాదు
- బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి
- నిన్న జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బండి సంజయ్

హైదరాబాద్, నవంబర్ 06 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. జూబ్లీహిల్స్ తరువాయి 2లో

## శబరిమలలో
# రసాయన కుంకుమపై నిషేధం

**కేరళ హైకోర్టు కీలక ఆదేశాలు**

- పంబ, సన్నిధానంలో రసాయన కుంకుమ అమ్మొద్దు.. దేవస్వంబోర్డుకు హైకోర్టు ఆదేశం
- పర్యావరణ పరిరక్షణ చర్యల్లో భాగంగా ఈ కీలక నిర్ణయం
- పంబ, సన్నిధానంలో షాంపూ ప్యాకెట్ల అమ్మకాలపైనా నిషేధం
- నవంబర్ 17 నుంచి మండల-మకరవిళక్కు సీజన్



2లో



2లో

## శ్రీచరణికి ఏపీ సర్కార్
# భారీ నజరానా...

- మహిళల ప్రపంచకప్ విజేత శ్రీచరణిపై ఏపీ ప్రభుత్వం వరాల జల్లు
- రూ. 2.5 కోట్ల నగదు, గ్రూప్-1 ఉద్యోగం, కడపలో ఇంటి స్థలం ప్రకటన
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తో భేటీ అయిన శ్రీచరణి, మిథాలీ రాజ్
- గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికిన మంత్రులు, ఏపీసీ పెద్దలు
- నేడు కడపలో శ్రీచరణికి ఘన సన్మానం.. భారీ ర్యాలీకి ఏర్పాట్లు

## ఆధునిక సాంకేతికతను యువత అందిపుచ్చుకోవాలి

- శాతవాహన వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

2లో



## కేసీఆర్, రేవంత్ పాలనలో
# రాష్ట్రం అధోగతి

- ఆ రెండు పార్టీలు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నాయి: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం



హైదరాబాద్ : పదేళ్లు పాలించిన కేసీఆర్, రెండేళ్లుగా ప్రభుత్వంలో ఉన్న రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అధోగతి పాలుచేశారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఆ రెండు పార్టీలు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అభ్యర్థిస్తున్నాయని నిలదీశారు. నియోజకవర్గంలోని రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయని.. డ్రైనేజీలు పొంగిపొర్లుతుండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని ఎర్రగడ్డలో తరువాయి 2లో

# విశాఖ నేవీ గూఢచర్యం కేసులో మరో ఇద్దరికి జైలు శిక్ష

అమరావతి, నవంబర్ 07 : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విశాఖపట్నం నేవీ గూఢచర్యం కేసులో మరో ఇద్దరు నిందితులకు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ప్రత్యేక కోర్టు జైలు శిక్ష విధించింది. పాకిస్థాన్ కు కీలక సమాచారం చేరవేశారన్న ఈ కేసుకు సంబంధించి శుక్రవారం తీర్పు వెలువరించినట్లు ఎన్ఐఏ ఒక ప్రకటనలో తెలిపింది. విశాఖపట్నం జిల్లాకు చెందిన కలవలపల్లి కొండబాబు, హిమాచల్ ప్రదేశ్ కాంగ్రా జిల్లాకు చెందిన అవినాశ్ సోమల్‌ను దోషులుగా నిర్ధారించిన విశాఖలోని ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానం.. వారికి ఐదేళ్ల 10 నెలల సాధారణ జైలు శిక్ష విధించింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం (UAPA) సెక్షన్ 18, అధికారిక రహస్యాల చట్టంలోని సెక్షన్ 3 కింద ఈ శిక్షలు ఖరారు చేసింది. దీంతో పాటు ఇద్దరికీ చెరో రూ.5,000 జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో ఏడాది జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొంది. ఈ తీర్పుతో ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం ఆరుగురు నిందితులకు శిక్ష పడినట్లయింది. దేశ భద్రత, సమగ్రతకు ముప్పు కలిగించే ఉద్దేశంతో విదేశీ గూఢచారులు, ఏజెంట్లతో కలిసి భారత నావికాదళ స్థావరాలు, కీలక సంస్థలపై గూఢచర్యానికి పాల్పడినట్లు వీరిపై ఆరోపణలు రుజువయ్యాయి. ఎన్ఐఏ దర్యాప్తు ప్రకారం, డిసెంబర్ 2019లో కొండబాబును ముంబైలో, సోమల్‌ను కర్ణాటకలోని కార్వార్‌లో అరెస్టు చేశారు. వీరు ఫేస్‌బుక్ ద్వారా పాకిస్థాన్ గూఢచార ఏజెంట్లతో పరిచయం పెంచుకున్నారు. అనంతరం వాట్సాప్ ద్వారా భారత రక్షణ రంగ రహస్యాలు, కీలక సమాచారాన్ని పంచుకున్నట్లు తేలింది. ఇందుకు ప్రతిఫలంగా పాక్ ఏజెంట్ల నుంచి డబ్బులు అందుకున్నారు. ఇప్పటికే ఇదే కేసులో దోషులుగా తేలిన అబ్దుల్ రెహమాన్, హరూన్ లక్డావాలా, షైస్తా కైసర్, ఇమ్రాన్ గిటేలీ ద్వారా నిందితుల బ్యాంకు ఖాతాల్లోకి పాక్ ఏజెంట్లు డబ్బు జమ చేసినట్లు ఎన్ఐఏ విచారణలో వెల్లడైంది. డిసెంబర్ 2019లో ఆంధ్రప్రదేశ్ కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం నుంచి ఈ కేసును ఎన్ఐఏ స్వీకరించి, మొత్తం 15 మందిని అరెస్టు చేసింది. 2020 జూన్ లో 14 మందిపై, 2021 మార్చిలో మరొకరిపై సప్లిమెంటరీ చార్జిషీట్ దాఖలు చేసింది. మిగిలిన నిందితులపై విచారణ ఇంకా కొనసాగుతోంది.

## అడ్డగోలుగా ఫీజులు పెంచుతున్నారు..
## బకాయిలు ఈరోజు కాకుంటే రేపు వస్తాయి

హైదరాబాద్, నవంబర్ 07 : ఫీజు రీయింబర్సుమెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉన్నత విద్యాసంస్థలు చేపట్టిన బంద్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. అడ్డగోలుగా ఫీజులు పెంచుకుని వచ్చి రీయింబర్సుమెంట్ అడుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విడతల వారీగా బకాయిలు చెల్లిస్తామని తెలిపారు. తమ హయాంలోని బకాయిలు ముందుగా చెల్లిస్తామని, విద్యార్థుల జీవితాలతో మాత్రం ఆటలు ఆడవద్దని విజ్ఞప్తి చేశారు. బకాయిలు ఈరోజు కాకుంటే రేపు వస్తాయని, కానీ కాలేజీలు బంద్ పెడితే విద్యార్థులు కోల్పోయిన సమయం తిరిగి వస్తుందా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులకు ఇబ్బంది లేదని అన్నారు. అన్ని వర్గాలను సమన్వయం చేసుకుంటూ వెళ్లాలని అన్నారు. రాష్ట్రానికి నెలకు రూ. 18 వేల కోట్ల ఆదాయం వస్తోందని, వేతనాలు, వడ్డీలు, ఇతర ఖర్చులు పోను మిగిలేది రూ. 5 వేల కోట్లే అన్నారు. ఈ ఆదాయంతో రాష్ట్రాన్ని ఎలా నడపాలో చెప్పండని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలేజీలను బంద్ చేయించిన వారితో చర్చించడానికి ఏముంటుందని ముఖ్యమంత్రి అన్నారు. ఏ కాలేజీ ఎంత డొనేషన్ వసూలు చేస్తుందో తనకు తెలుసని అన్నారు. కాలేజీలు నిబంధనలు పాటించాలని అన్నారు. ఇష్టానుసారం ఫీజులు పెంచుకుంటూ పోతే ఎలా అని ప్రశ్నించారు. విద్య వ్యాపారం కాదని, సేవగా భావించాలని సూచించారు. రాజకీయ నేతలు అండగా ఉన్నారని విద్యార్థులతో ఆడుకోవద్దని హెచ్చరించారు.

## శబరిమలలో రసాయన కుంకుమపై నిషేధం...
## కేరళ హైకోర్టు కీలక ఆదేశాలు

కేరళ, నవంబర్ 07 : శబరిమల యాత్ర ప్రారంభానికి ముందు కేరళ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని శబరిమలలో రసాయనాలతో కూడిన కుంకుమ అమ్మకాలను తక్షణమే నిషేధించాలని ట్రావెన్‌కోర్ దేవస్వంబోర్డు (టీడీబీ) ను ఆదేశించింది. నవంబర్ 17 నుంచి వార్షిక మండలమకరవిళక్కు యాత్ర సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. జస్టిస్ రాజా విజయరాఘవన్, జస్టిస్ కె.వి. జయకుమార్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. 2025 26 యాత్ర సీజన్‌లో యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన విశ్రాంతి కేంద్రాల ('ఎడతావలంలు') వద్ద సౌకర్యాలపై స్పెషల్ కమిషనర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా సుమోటోగా స్వీకరించిన పిటిషన్‌పై కోర్టు విచారణ చేపట్టింది. యాత్రికుల కోసం పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఆహారం, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని అక్టోబర్ 16న ఇచ్చిన ఆదేశాలను ఈ సందర్భంగా ధర్మాసనం గుర్తుచేసింది. ఎరుమేలి సమీపంలోని ప్రవాహాల వద్ద యాత్రికులు ప్లాస్టిక్ షాంపూ ప్యాకెట్లను పడేస్తుండటం వల్ల కాలుష్యం పెరుగుతోందని గతంలోనే కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఆ ప్రాంతంలో ప్లాస్టిక్ ప్యాకెట్లపై నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని కొట్టాయం జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. శుక్రవారం నాటి విచారణలో ఎరుమేలి గ్రామ పంచాయతీ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. వలియతోడు వాగులో షాంపూ ప్యాకెట్లు, ఇతర వ్యర్థాలను ఇప్పటికీ పడేస్తున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా 'పేటతుళ్లల్' ఘట్టంలో భక్తులు వాడే రసాయన కుంకుమ కూడా కాలుష్యానికి ఒక ప్రధాన కారణంగా మారుతోందని తెలిపారు. ఆ తర్వాత దానిని శుభ్రం చేసుకోవడానికి భక్తులు డిటర్జెంట్లు, షాంపూలు వాడటంతో నీరు కలుషితమవుతోందని వివరించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, పంబ మరియు సన్నిధానం వద్ద షాంపూ ప్యాకెట్లు, రసాయన కుంకుమ అమ్మకాలపై కఠిన నిషేధం విధించాలని స్పష్టం చేసింది. అంతేకాకుండా, వ్యర్థాలు నీటిలో పేరుకుపోకుండా వాగులకు వలలు లేదా చెక్‌డ్యామ్‌లు ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని టీడీబీకి సూచించింది. కొచ్చిన్, గురువాయూర్ దేవస్వంబోర్డులు, చెంగన్నూర్ మున్సిపాలిటీ కూడా కోర్టు ఆదేశాల అమలుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపాయి. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం, తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

## రేవంత్ రెడ్డిపై వ్యాఖ్యలు..
## బండి సంజయ్‌పై ఈసీకి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్

హైదరాబాద్, నవంబర్ 07 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం సందర్భంగా బండి సంజయ్ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి మాట్లాడారని కాంగ్రెస్ పేర్కొంది. ఈ మేరకు పీసీసీ ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు అందజేసింది. నిన్న జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బండి సంజయ్, ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలిస్తే తులం బంగారం ఇవ్వడమేమో కానీ, ప్రజల వద్ద ఉన్న బంగారాన్ని కూడా గుంజుకుంటారని విమర్శించారు. ఎన్నికలకు ముందు ఎన్నో అవినీతి ఆరోపణలు చేసిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక కేసీఆర్ కుటుంబాన్ని ఒక్క కేసులో కూడా ఎందుకు జైల్లో పెట్టలేదని ప్రశ్నించారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు కలిసి రాష్ట్రాన్ని దోచుకుంటున్నాయని ఆయన ఆరోపించారు.

## జై షా జోక్యంతో... ప్రతీక రావల్ కు అందిన వరల్డ్ కప్ విన్నర్ మెడల్

ఢిల్లీ, నవంబర్ 07 : భారత మహిళా క్రికెట్ జట్టు బ్యాటర్ ప్రతీక రావల్ ఎట్టకేలకు తన 2025 వన్డే ప్రపంచకప్ విన్నర్ మెడల్ ను అందుకుంది. టోర్నమెంట్ ఫైనల్‌కు ముందు గాయపడి జట్టుకు దూరమైనప్పటికీ, ఐసీసీ ఛైర్మన్ జై షా ప్రత్యేక చొరవతో ఆమెకు ఈ పతకం లభించింది. ఈ విషయాన్ని ప్రతీక స్వయంగా వెల్లడించింది. ప్రపంచకప్ టోర్నీలో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ప్రతీక రావల్ కాలికి గాయమైంది. దీంతో ఆమె టోర్నీలోని చివరి దశకు దూరమైంది. ఫైనల్లో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో ఆమె స్థానంలో షఫాలీ వర్మ ఆడింది. ఐసీసీ నిబంధనల ప్రకారం, ఫైనల్ మ్యాచ్‌కు ఎంపికైన 15 మంది సభ్యుల స్క్వాడ్‌కు మాత్రమే పతకాలు అందజేస్తారు. ఈ కారణంగా, నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో జరిగిన విజయోత్సవాల్లో వీల్‌చైర్‌లో కనిపించిన ప్రతిక మెడలో పతకం లేదు. ఈ విషయంపై ఐఏఎన్ఎస్‌తో ప్రత్యేకంగా మాట్లాడిన ప్రతీక, "నాకు ఇప్పుడు నా సొంత పతకం ఉంది. ఐసీసీ ఛైర్మన్ జై షా గారు నా కోసం కూడా ఒక పతకం పంపమని ఐసీసీని అభ్యర్థించారు. ఆయన చొరవతో నాకు ఈ మెడల్ వచ్చింది. ఆయనకు, నా సహాయక సిబ్బందికి, మా జట్టు మొత్తానికి నా ధన్యవాదాలు. నేను జట్టులో భాగం కాబట్టి నా కోసం వారు ఒక పతకాన్ని ఏర్పాటు చేశారు" అని వివరించింది. గాయపడటానికి ముందు ఈ టోర్నీలో ప్రతీక అద్భుతంగా రాణించింది. ఆరు ఇన్నింగ్స్‌లలో 308 పరుగులు చేసి, జట్టులో రెండో అత్యధిక స్కోరర్‌గా నిలిచింది. ప్రపంచకప్ గెలిచిన తర్వాత జీవితం అద్భుతంగా, మాటలకు అందని విధంగా ఉందని ఆమె అభివర్ణించింది. "ప్రపంచకప్ గెలిచిన తర్వాత ప్రధాని, రాష్ట్రపతి వంటి ప్రముఖులను కలిశాం. అదొక మ్యాజికల్ ఫీలింగ్. ఆ ట్రోఫీని చూసినప్పుడల్లా దాంతో ఫోటోలు దిగుతూనే ఉన్నాం. మేం దాన్ని అంత సులభంగా వదిలిపెట్టడం లేదు. కొందరైతే ట్రోఫీని పక్కన పెట్టుకుని నిద్రిస్తున్న ఫోటోలను కూడా పోస్ట్ చేశారు" అని ప్రతీక తన సంతోషాన్ని పంచుకుంది.

## వీళ్లేం సెలబ్రిటీలు?
## రైనా, శిఖర్ ధావన్‌లపై సజ్జనార్ తీవ్ర ఆగ్రహం

అమరావతి, నవంబర్ 07 : ప్రముఖ క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్ ధావన్‌పై హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ అసహనం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్ కేసులో వీరికి చెందిన రూ. 11 కోట్ల ఆస్తులను ఈడీ జప్తు చేసింది. ఈ మేరకు వార్తా కథనాన్ని తన సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా పంచుకున్న సజ్జనార్, "వీళ్ళేం సెలబ్రిటీలు?" అంటూ వ్యాఖ్యానించారు. అభిమానాన్ని కూడా సొమ్ము చేసుకునే వీరు ఆదర్శనీయమైన ఆటగాళ్లు ఎలా అవుతారని ఆయన ప్రశ్నించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ మహమ్మారికి బానిసలై ఎంతోమంది యువకులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని సజ్జనార్ ఆవేదన వ్యక్తం చేశారు. వేలాదిమంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని గుర్తు చేశారు. సమాజాన్ని ఛిద్రం చేస్తోన్న బెట్టింగ్ భూతాన్ని ప్రోత్సహించిన ఈ క్రికెటర్లు కూడా బాధ్యులేనని ఆయన అభిప్రాయపడ్డారు. సమాజానికి మేలు చేయడానికి, యువత ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి సెలబ్రిటీలు మంచి మాటలు చెప్పాలని హితవు పలికారు. అభిమానించే వారిని తప్పుదోవ పట్టించి, వారి ప్రాణాలను తీయడానికి కారణం కావొద్దని సూచించారు.

## శ్రీచరణికి ఏపీ సర్కార్ భారీ నజరానా...
## రూ. 2.5 కోట్లు, గ్రూప్-1 ఉద్యోగం

హైదరాబాద్, నవంబర్ 07 : మహిళల వన్డే ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శనతో టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించిన తెలుగమ్మాయి, క్రికెటర్ శ్రీచరణిపై ఏపీ ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. ఆమెకు రూ. 2.5 కోట్ల నగదు బహుమతి, గ్రూప్1 స్థాయి ప్రభుత్వ ఉద్యోగం, సొంత జిల్లా కడపలో 1,000 చదరపు గజాల ఇంటి స్థలాన్ని కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఏపీ సీఎంఓ ట్వీట్ చేసింది. అలాగే మంత్రి లోకేశ్ కూడా ఈ విషయమై 'ఎక్స్' వేదికగా ప్రత్యేకంగా పోస్టు పెట్టారు. "శ్రీచరణి అచంచల అంకితభావం ఆంధ్రప్రదేశ్‌ను గర్వపడేలా చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆమె అద్భుతమైన విజయాన్ని గ్రూప్1 ప్రభుత్వ ఉద్యోగం, రూ. 2.5 కోట్ల నగదు బహుమతి, కడపలో నివాస స్థలంతో సత్కరిస్తుందని ప్రకటించడానికి సంతోషంగా ఉంది" అంటూ మంత్రి లోకేశ్ పోస్ట్ చేశారు. అంతకుముందు శ్రీచరణి, మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్‌తో కలిసి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో శ్రీచరణిని అభినందించిన చంద్రబాబు, ప్రపంచకప్ గెలిచి దేశానికి గర్వకారణంగా నిలిచారని ప్రశంసించారు. మహిళా క్రీడాకారులకు శ్రీచరణి ఆదర్శంగా నిలిచారని, ఎంతోమందికి స్ఫూర్తినిస్తారని కొనియాడారు. ప్రపంచకప్ గెలిచిన ఆనంద క్షణాలను శ్రీచరణి సీఎం, మంత్రితో పంచుకున్నారు. ఈ సందర్భంగా శ్రీచరణి మాట్లాడుతూ... ప్రపంచకప్ గెలిచిన తర్వాత దేశ ప్రజలు, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల ప్రజలు చూపిస్తున్న అభిమానానికి చాలా సంతోషంగా ఉందని తెలిపారు. తన కుటుంబం అందించిన ప్రోత్సాహమే తనను ఈ స్థాయికి తీసుకొచ్చిందని, ముఖ్యంగా తన మామ తనను క్రికెట్ ఆడేందుకు ఎంతగానో ప్రోత్సహించారని గుర్తుచేసుకున్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆధ్వర్యంలో శిక్షణ పొందానని చెప్పారు. ఈ విజయం మొదటి అడుగు మాత్రమేనని, భవిష్యత్తులో మరిన్ని లక్ష్యాలు ఉన్నాయని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీని కలిసినప్పుడు ఆయన భవిష్యత్ కార్యాచరణపై విలువైన సలహాలు ఇచ్చారని పేర్కొన్నారు. ఇక, ఇవాళ సాయంత్రం కడపలో ఏసీఏ, కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీచరణికి భారీ సన్మాన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఆధునిక సాంకేతికతను
## యువత అందిపుచ్చుకోవాలి

నిరంతర విద్య విజయానికి ఆత్మలాంటిదని, నైపుణ్యంతో కూడిన ఆధునిక సాంకేతికతను యువత అందిపుచ్చుకోవాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆకాంక్షించారు. శుక్రవారం కరీంనగర్‌లో నిర్వహించిన శాతవాహన విశ్వవిద్యాలయ రెండో స్నాతకోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డాక్టరేట్ పొందిన 25 మందికి పట్టాలు, 2019 నుంచి 2025 వరకు వివిధ విభాగాల్లో ప్రతిభకనబరిచిన 161 మందికి బంగారు పతకాలు అందజేశారు. గవర్నర్ మాట్లాడుతూ.. గ్రామీణ విద్యార్థులకు శాతవాహన వర్సిటీ ఒక వరంగా మారిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో న్యాక్ హోదాతోపాటు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) దిశగా తీర్చిదిద్దాలని అధ్యాపకులకు సూచించారు. అంతకుముందు శాతవాహన ఉపకులపతి ఉమేశ్‌కుమార్ వర్సిటీ ప్రగతి నివేదికను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ ఉపకులపతి బి.జె.రావు పాల్గొన్నారు. అనంతరం గవర్నర్ నేరుగా కరీంనగర్ కలెక్టరేట్‌కు వెళ్లారు. ఆయనకు ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్, కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ ఆలం స్వాగతం పలికారు.

## కేసీఆర్, రేవంత్ పాలనలో రాష్ట్రం అధోగతి

హైదరాబాద్ : పదేళ్లు పాలించిన కేసీఆర్, రెండేళ్లుగా ప్రభుత్వంలో ఉన్న రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అధోగతి పాలుచేశారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఆ రెండు పార్టీలు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అభ్యర్థిస్తున్నాయని నిలదీశారు. నియోజకవర్గంలోని రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయని.. డ్రైనేజీలు పొంగిపొర్లుతుండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని ఎర్రగడ్డలో కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో కలిసి భాజపా అభ్యర్థి దీపక్‌రెడ్డి తరపున ఆయన ప్రచారం నిర్వహించారు. జూబ్లీహిల్స్‌లో స్థిరపడిన ఇతర రాష్ట్రాలకు చెందిన ఓటర్లతో ఆత్మీయ సమ్మేళనంలోనూ షెకావత్, కిషన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఎర్రగడ్డ ప్రచారంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ''ఎన్నికల ముందు అనేక హామీలిచ్చిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు మాట మార్చుతున్నారు.

## ఎవరెన్ని గిమ్మిక్కులు చేసినా గెలుపు మాగంటి సునీతదే

హైదరాబాద్ : హైడ్రా గురించి గొప్పగా చెప్పుకొంటున్న రేవంత్‌రెడ్డికి దమ్ముంటే తన మంత్రులు అక్రమంగా కట్టుకున్న నిర్మాణాలను తొలగించాలని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సవాల్ విసిరారు. 24 నెలల తన పాలన చూపించి ఓట్లు అడగాలన్నారు. పదేళ్ల కేసీఆర్ పరిపాలన.. రెండేళ్ల దుర్మార్గ పాలన మీ కళ్ల ముందే ఉందని, ప్రజలు చూసి తీర్పు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. భారత రాష్ట్ర సమితి అభ్యర్థి మాగంటి సునీత తరఫున జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని వెంగళరావునగర్ డివిజన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన రోడ్‌షోలో కేటీఆర్ మాట్లాడారు. ఏటీఎంలు, బ్యాంకుల ముందు అటెన్షన్ డైవర్షన్ చేసి సొత్తు దోచుకెళ్లే మాదిరి.. ఇప్పుడు భాజపా రంగంలోకి దిగిందని విమర్శించారు. చిల్లర పంచాయితీలు పెట్టి రేవంత్‌రెడ్డికి లాభం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎవరు ఎన్ని ప్రచారాలు, గిమ్మిక్కులు చేసినా గెలుపు మాగంటి సునీత, కేసీఆర్‌లదేనని స్పష్టం చేశారు.

**కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలి?**

అన్ని వర్గాలను 24 నెలలుగా మోసం చేస్తున్న కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేయాలని కేటీఆర్ ప్రశ్నించారు. భారత రాష్ట్ర సమితి హయాంలో హైదరాబాద్‌లో 36 ఫ్లైఓవర్లు కడితే.. రేవంత్ సర్కారు 36 గుంతలు కూడా పూడ్చలేదని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఒకసారి మోసం చేశారని.. మళ్లా మళ్లా మోసపోతే తప్పు మనది అవుతుందన్నారు.

*** గత ముఖ్యమంత్రులు విజ్ఞతతో అభివృద్ధి చేశారు..**

పాతిక సంవత్సరాల్లో ఆరుగురు ముఖ్యమంత్రులు మారితే ఐదుగురు హైదరాబాద్ అభివృద్ధికి ఎంతో చేశారని కేటీఆర్ అన్నారు. 'హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబు గట్టిగా ప్రయత్నం చేశారు. రాజశేఖరరెడ్డి అభివృద్ధితోపాటు సంక్షేమం జోడించారు. రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి శక్తివంచన లేకుండా ప్రయత్నం చేశారు. పదేళ్లు కేసీఆర్ పరిపాలించారు. తెలంగాణను ఎకానమిక్ గ్రోత్ ఇంజిన్‌గా మలిచారు. పల్లెలు, పట్టణాలు, నగర అభివృద్ధికి ఎంతో చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ ఏం చేశారో చెప్పాలి' అని ప్రశ్నించారు.

**ఎన్టీఆర్ ఆత్మ క్షోభిస్తుంది..**

కాంగ్రెస్ పార్టీకి ఎన్టీఆర్ పేరు ఎత్తే నైతిక అర్హత లేదని కేటీఆర్ అన్నారు. విమానాశ్రయానికి ఉన్న ఎన్టీఆర్ పేరును తొలగించి రాజీవ్‌గాంధీ పేరు పెట్టింది కాంగ్రెస్సేనని పేర్కొన్నారు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ విగ్రహాలు పెడితే ఆయన ఆత్మ క్షోభిస్తుందని అన్నారు. ఎన్టీఆర్ విగ్రహాలను తాము ఖమ్మం, కూకట్‌పల్లి, మోతీనగర్‌లలో ఏర్పాటు చేశామని.. కాంస్య విగ్రహం ఏర్పాటు చేసే బాధ్యతను తాను తీసుకుంటానన్నారు.

# దొంగల గ్యాంగ్ పట్టిన పాల్వంచ పోలీసులకు ఎస్పీ అభినందనలు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో చురుగ్గా వ్యవహరించిన పోలీస్ బృందం మరోసారి నేరస్తులను పట్టుకుని తన సత్తా చాటింది. గురువారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో పట్టణంలోని దమ్మపేట సెంటర్ వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పాల్వంచ సీఐ సతీష్ తన సిబ్బందితో కలిసి ఇంట్లో దొంగతనం చేయడానికి వచ్చిన తొమ్మిది మంది దుండగులను పట్టుకోవడంలో విజయం సాధించారు.కత్తులు, మాస్కులు, ఇనుపరాడ్లతో రెండు కార్లలో తిరుగుతూ దొంగతనానికి సిద్ధమైన ఈ గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి జైలుకు పంపించారు.ఈ సాహసోపేతమైన చర్యకు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్వంచ పోలీస్ అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో భాద్యతగా విధులు నిర్వర్తిస్తూ ప్రజల రక్షణ కోసం కృషి చేసే వారికి ఎప్పటికైనా మంచి పేరు లభిస్తుంది" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్, సీఐ సతీష్, ఎస్సై సుమన్, కానిస్టేబుళ్లు హుస్సేన్, అబ్బురాములు తదితరులు పాల్గొన్నారు.

# చర్లపల్లి చక్రిపురం కాలనీలో యూజిడి పైప్‌లైన్ పనులు ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, కాప్రా : ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ పరిధిలోని వివిధ కాలనీలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ సమస్యలను పరిష్కరించేందుకు మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్ ప్రభాకర్ ప్రయత్నంతో దాదాపు రూ.19 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఇందులో భాగంగా చర్లపల్లి డివిజన్ చక్రిపురం కాలనీలో యూజిడి పనులు రూ.29 లక్షల వ్యయంతో ప్రారంభమయ్యాయి.కాలనీలో వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం నుండి పోచమ్మ దేవాలయం వరకు రూ.16.20 లక్షలు, చక్రి స్కూల్ వెనుక గల్లీలో రూ.8.60 లక్షలు, గుబ్బల గోపాలకృష్ణ వీధిలో రూ.3.50 లక్షల వ్యయం కేటాయించారు. ఈ పనులను వాటర్ వర్క్స్ డీజీఎం సతీష్ కుమార్, చర్లపల్లి మేనేజర్ సందీప్ కుమార్, రైల్వే బోర్డు ఎస్సీసీ సభ్యులు మచ్చ లక్ష్మణ్ గౌడ్, లైన్మెన్ భరత్ పరిశీలించారు.ఈ సందర్భంగా కాలనీకి నిధులు కేటాయించిన ఎంపీ ఈటెల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్. ఎస్ ప్రభాకర్‌కు కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు.

# చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయవద్దు

* **అల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : చెత్తను నాలాలలో గాని, రోడ్లమీద గాని, చెరువులలో గాని వేయవొద్దని అల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ప్రజలను కోరారు. అల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్ నగర్ , గురుగోవింద్ సింగ్ నగర్ లలో డ్రైనేజీ లైన్ పుడుకపోయి డ్రైనేజి నీరు రోడ్డుపైన పొంగుతుదన్న విషయాన్ని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకురాగా కార్పొరేటర్ జి.ఎచ్.ఎం.సి సిబ్బందితో ఎయిర్ టెక్ యంత్రం సహాయంతో పూడికను క్లియర్ చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో పారిశుధ్య సమస్య ఎక్కువగా ఉందని అన్నారు. చెత్తను రోడ్ల మీద లేదా బిల్డింగ్ ల మధ్యలో వేయడం వల్ల మీరు మీ పిల్లలు రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరు తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని, తడిచెత్తా , పొడిచెత్తను వేరువేరుగా బస్తీకి వచ్చి చెత్త సేకరించే ఆటోలలో మాత్రమే వేయాలని సూచించారు.. జి.ఎచ్. ఎం.సి సిబ్బంది , కాలనీ అసోసియేషన్ సభ్యులు కలిసికట్టుగా పనిచేసి చెత్తను రోడ్లమీద వేయకుండా ప్రజలలో అవగాహన తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోశెట్టిగౌడ్, రాందాస్ గౌడ్, యాదగిరి, సంగమేష్, రాజుగౌడ్, సత్యరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# చేయి చేయి కలిపారు... రోడ్డు బాగుచేశారు

* **ఆదర్శంగా మారిన చన్వల్లి గ్రామ యువకులు**







ప్రజాస్ఫూర్తి, చేవెళ్ల : యువకులు అంతేనే అట... పాట... చిల్ అవడం. జల్సాలు చేయడమే మనకు తెలుసు. కానీ చన్వల్లి గ్రామ యువత ఇందుకు భిన్నంగా ఉన్నారు. అందరికి ఆదర్శంగా నిలిచారు. గతుకులమాయంగా మారిన రోడ్డును మర్మత్తులు చేసి ఓరా అనిపించారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం చన్వల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గతుకులమాయంగా ఉన్న రోడ్లతో ఇబ్బందులు పడటం గ్రామస్థులకు నిత్యకృత్యం గా మారింది. తాము పడుతున్న ఇబ్బందులను గ్రామస్తులు పలుమార్లు అధికారులు నాయకులకు విన్నవించుకున్న ఫలితం శూన్యం.ఎక్కడనుంచి స్పందన రాకపోవడంతో గ్రామంలోని యువకులు ఒకటిగా చేరి తల కొంత డబ్బులు వేసుకున్నారు. తమ గ్రామ రోడ్డును బాగుచేసుకోవాలని సంకల్పించారు. ఇంకేముంది డబ్బులను వేసుకోవడం తో పాటు శ్రమధానం చేశారు. వేసుకున్న డబ్బులతో జీసిబి ని తెప్పించి రోడ్డును చదును చేసుకున్నారు. రోడ్డును మరమ్మత్తులు చేసిన గ్రామ యువకులను గ్రామ పెద్దలను అభినందించారు.



# యస్ ఆర్ స్కూల్ లో ఘనంగా వందే మాతరం 150 ఏళ్ల సంబరాలు

ప్రజా స్ఫూర్తి, నల్లగొండ : స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖమైన నినాదంగా మారి యావద్భారత ప్రజానీకాన్ని ఉద్యమంలోకి ఉరికించిన వందే మాతరం గేయం రూపొంది 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని ఉత్సవంగా జరుపుకోవాలని కేంద్ర మంత్రివర్గ నిర్ణయం, భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు, శుక్రవారం నల్లగొండ పట్టణంలోని ఎస్ఆర్ పాఠశాలలో వందే మాతరం 150 ఏళ్ల వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఆర్ స్కూల్ జోనల్ ఇన్చార్జి దోనాలా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, బంకించంద్ర ఛటర్జీ 1875 నవంబర్ 7వ తేదీన వందే మాతరం గేయాన్ని రచించారని, దానిని రవీంద్రనాథ్ టాగూర్ స్వరపరిచి 1896లో మొదటిసారిగా పాడారని, 1905 బెంగాల్ విభజన సమయానికి ఈ గేయం పరేడ్ సాంగ్ గా పేరొందిందని, 1950లో జాతీయ గేయం హోదా దక్కిందని పేర్కొన్నారు. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరిగిన రాజకీయ నిరసనల సమయంలో వందే మాతరం గేయం ఊపందుకుంది. బాల గంగాధర తిలక్, లాలా లజపతి రాయ్, భగత్ సింగ్, సుభాష్ చంద్ర బోస్ వంటి యోధులకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఆంధ్ర రాష్ట్రం సహా దేశమంతా ఈ గేయాన్ని బిపిన్ చంద్ర పాల్ విస్తరింపజేశారు. జాతీయవాదం, ఐక్యత, బ్రిటిష్ వ్యతిరేక పోరాటంలో ఈ గీతం ఉత్తేజపరిచే నినాదంగా మారడంతో బ్రిటిష్ ప్రభుత్వం దీనిని నిషేధించింది. ఆనంద మఠం నవలలో భాగమైన ఈ వందే మాతరం గేయం ఎన్ని నిషేధాలకు, మార్పులకు గురైనా, అవన్నీ తాత్కాలికమే. స్వాతంత్ర్యం కోసం నిరసన తెలిపే ప్రతి గొంతుకకూ ఊపిరినిచ్చింది వందేమాతరం గేయం అని కొనియాడారు. ముందుగా భరతమాత, బంకించంద్ర ఛటర్జీ చిత్రపటాలకు పూలమాలలు సమర్పించి, వందేమాతరం గేయం ఫోటోను పూలతో అలంకరించి, సామూహిక వందే మాతరం గేయం ఆలపించిన అనంతరం అందరి చేత స్వదేశీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



# పోలీసులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలి

* **డయల్ 100కు ఫోన్ రాగానే తక్షణమే స్పందించాలి: ఎస్పీ రోహిత్ రాజు**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:పెట్రోలింగ్, బ్లూ కోర్ట్స్ వాహనాలతో సంచరిస్తూ పోలీస్ సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. శుక్రవారం ఎస్పీ రోహిత్ రాజు లక్ష్మీదేవిపల్లి మండల పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా నిత్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. పోలీస్ అధికారులు, సిబ్బంది వృత్తిపరమైన, వ్యక్తిగత సమస్యలు ఎలాంటివి తలెత్తినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎస్పీ వెంట కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు రమణారెడ్డి, చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.

# స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గ బీసీ జేఏసీ కన్వీనర్ గా గట్టు రమేష్ గౌడ్



స్టేషన్ ఘన్పూర్, ప్రజాస్ఫూర్తి : స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ స్థాయి బీసీ జేఏసీ నాయకుల సమావేశం నియోజక వర్గ కేంద్రం గౌడ కమ్యూనిటీ హాల్లో శుక్రవారం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సమామేశానికి బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు, గాండ్ల దేవేంజర్, జిల్లా నాయకులు గడ్డం రాజు, కన్నబోయిన రవి యాదవ్, ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ జేఏసీ అధ్యక్షులు, వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ఆదేశానుసారం, స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గ స్థాయి కమిటిని ఎన్నుకోవటం జరిగింది, నియెజకవర్గ కన్వీనర్ గా గట్టు రమేష్ గౌడ్ ఎక్స్ పిఏసి చైర్మన్, కో కన్వీనర్ గా పెసరు సారయ్య ముదిరాజ్ ,అంబటి కిషన్ రాజు, పొన్న శ్రీనివాస్ జేఏసీ, గట్టు శ్రీను బంగ్లా,మేకల మల్లేష్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా రాబోయే రోజులు బీసీలకు విద్య ఉద్యోగ ఉపాధి స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల సాధించేవరకు పోరాటం చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించడం జరిగింది.

# ఫర్నీచర్ ప్రొడక్షన్ శిక్షణకు 19 మంది ఎంపిక

* **రాజమండ్రిలోనూ ఫర్నిచర్ శిక్షణ అవకాశం: జిల్లా కలెక్టర్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:జిల్లా కలెక్టరేట్ లో ఎన్ఎస్టీఐ, ఎఫ్ఎఫ్ఎస్సి, జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఒరియంటేషన్, డ్రాయింగ్, ఆప్టిట్యూడ్, ప్రాక్టికల్, ఇంటర్వ్యూ పరీక్షలలో 19 మంది అభ్యర్థులు మల్టీపర్పస్ అసిస్టెంట్ ఫర్ ఫర్నిచర్ ప్రొడక్షన్, ఇన్‌స్టాలేషన్ శిక్షణకు ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థుల కోసం ఒక్కొక్కరికి రూ.5 వేలు రిజిస్ట్రేషన్ ఫీజును జిల్లా యంత్రాంగం భరిస్తుందని, శిక్షణ కాలమంతా ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. హైదరాబాద్‌తోపాటు రాజమండ్రిలోనూ శిక్షణ అవకాశం కల్పిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఇందుకోసం శనివారం ఎంపిక ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. రాజమండ్రిలో ఫర్నిచర్ అసిస్టెంట్ రెసిడెన్షియల్ శిక్షణ కోసం 11 సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఈ అవకాశాన్ని జిల్లా యువత తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు. సీట్ల భర్తీ కోసం శనివారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో రూమ్ నెంబర్ ఎస్-20 నందు ఓరియంటేషన్, ఎంపిక పరీక్ష నిర్వహించనున్నామని, ఆసక్తి గల అభ్యర్థులు తప్పక హాజరుకావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# హెడ్ సిస్టర్ రూబికు మొక్కను అందజేసిన విద్యార్థిని నైనికరజువా



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్త గూడెం: వందేమాతరం రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా కొత్తగూడెం సెయింట్ మేరీస్ పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. వందేమాతర గీతాలాపన అనంతరం 6వ తరగతి విద్యార్థిని, ప్రకృతి హరిత దీక్షకురాలు నైనిక రజువా పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాల హెడ్ సిస్టర్ రూబికు జెడ్ ప్లాంట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా హెడ్ సిస్టర్ రూబి మాట్లాడుతూ "నైనిక రజువా చిన్న వయసులోనే ప్రకృతిహిత దృక్పథంతో మొక్కలు నాటడం, వాటిని ఇతరులకు బహుమతిగా ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ చైతన్యం ప్రతి విద్యార్థిలో పెరగాలని ఆకాంక్షించారు. ఇప్పటివరకు ఎన్ని మొక్కలు నాటావు, ఎన్ని పంపిణీ చేశావని నైనికను సిస్టర్ రుబీ అడిగి తెలుసుకున్నారు.

## స్వాతంత్ర్యం కోసం నిరసన తెలిపే
# ప్రతి గొంతుకకూ ఊపిరినిచ్చింది వందేమాతరం గేయం




కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : స్వాతంత్ర్యం కోసం నిరసన తెలిపే ప్రతి గొంతుకకూ ఊపిరినిచ్చింది వందేమాతరం గేయం అని వక్తలు కొనియాడారు. స్వాతంత్య సంగ్రామంలో ప్రముఖమైన నినాదంగా మారి యావద్భారత ప్రజానీకాన్ని ఉద్యమంలోకి ఉరికించిన వందే మాతరం గేయం రూపొంది 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని ఉత్సవంగా జరుపుకోవాలని కేంద్ర మంత్రివర్గ నిర్ణయం, భారత ప్రధాని నరేంద్ర మోడి పిలుపు మేరకు ప్రగతి నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వందే మాతరం 150 ఏళ్ల వేడుకను శుక్రవారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా భరతమాత, బంకించంద్ర ఛటర్జీ చిత్రపటాలకు పూలమాలలు సమర్పించి, వందేమాతరం గేయం ఫోటోను పూలతో అలంకరించి, సామూహిక వందే మాతరం గేయం ఆలపించిన అనంతరం అందరి చేత స్వదేశీ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ బంకించంద్ర ఛటర్జీ 1875 నవంబర్ 7వ తేదీన వందే మాతరం గేయాన్ని రచించారని, దానిని రవీంద్రనాథ్ టాగూర్ స్వరపరిచి 1896లో మొదటిసారిగా పాడారని, 1905 బెంగాల్ విభజన సమయానికి ఈ గేయం పరేడ్ సాంగ్ గా పేరొందిందన్నారు. 1950లో జాతీయ గేయం హోదా దక్కిందని పేర్కొన్నారు. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరిగిన రాజకీయ నిరసనల సమయంలో వందే మాతరం గేయం ఊపందుకుంది. బాల గంగాధర తిలక్, లాలా లజపతి రాయ్, భగత్ సింగ్, సుభాష్ చంద్ర బోస్ వంటి యోధులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. ఆంధ్ర రాష్ట్రం సహ దేశమంతా ఈ గేయాన్ని బిపిన్ చంద్ర పాల్ విస్తరింపజేశారన్నారు. జాతీయవాదం, ఐక్యత, బ్రిటిష్ వ్యతిరేక పోరాటంలో ఈ గీతం ఉత్తేజపరిచే నినాదంగా మారడంతో బ్రిటిష్ ప్రభుత్వం దీనిని నిషేధించిందని, ఆనంద మఠం నవలలో భాగమైన ఈ వందే మాతరం గేయం ఎన్ని నిషేధాలకు, మార్పులకు గురైనా, అవన్నీ తాత్కాలికమేనన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎమ్ఆర్ఎస్ రాజు, ఎన్ చెన్నయ్య, రచ్చ చక్రధర్, కె ప్రసన్న భారతి, నవీన్ చంద్ర, చంద్ర సేనా రెడ్డి, టి కల్పనా కుమారి, సత్యనారాయణ, జి శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ మహా విప్లవం స్ఫూర్తితో అవినీతి దోపిడి, సమానతలు లేని సమాజం కై పోరాడాలి



సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలు కానీ లక్ష్మణ్

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : అక్టోబర్ మహా విప్లవ పోరాట స్ఫూర్తితో అవినీతి దోపిడి ,సమానతలు లేని సమాజం కై పోరాడాలని సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలు కానీ లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ మహా విప్లవం సందర్భంగా షాపూర్ నగర్ శుభం హోటల్ దగ్గర సిపిఎం పార్టీ జెండాను పార్టీ మండల కమిటీ సభ్యుడు పసుల అంజయ్య అధ్యక్షతన కీలుకాని లక్ష్మణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ గతిని మార్చింది అక్టోబర్ మహా విప్లవమన్నారు. 1917 అక్టోబర్ లో రష్యాలో అవినీతి అసమానతలు దోపిడీ లేని కార్మిక వర్గ నాయకత్వంలో తొలి సోషలిస్ట్ ప్రభుత్వాన్ని లెనిన్ నాయకత్వంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రపంచంలో అనేక ప్రభుత్వాలు మారినా రాజ్యాలు కూలిన ఆ మార్పులన్నింటికంటే విశిష్టమైన వినూత్నమైన మార్పు ఈ విప్లవం ద్వారా ప్రపంచ మానవాళి అనుభవంలోకి వచ్చిందన్నారు. అక్టోబర్ మహా విప్లవం కేవలం రష్యా సరిహద్దుల్లోనే కాక ప్రపంచవ్యాప్తంగా విప్లవ ఆలోచనలకు కార్మిక ఉద్యమాలకు వలస వ్యతిరేక పోరాటాలకు ప్రేరణనిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు దేవదానం కరుణాకర్ పార్టీ నాయకులు తిమ్మప్ప ఆంజనేయులు భాషా వీరేష్ దుర్గ నాయక్ సునీల్ కనకయ్య శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## అన్న ప్రసాద వితరణ నూతన కమిటీ ఎన్నిక




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: శ్రీ శ్రీ శ్రీ అయ్యప్ప స్వామి సేవా ట్రస్ట్ కొయ్యలగూడెం ఆధ్వర్యం లో గత 9సంవత్సరాలగా మాల ధరించే భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా శుక్రవారం అన్న ప్రసాద వితరణ నూతన కమిటీని ఎనుకున్నారు. నూతన అధ్యక్షునిగా రవ్వ సంతోష్ కుమార్, కార్యనిర్వహణ అధ్యక్షునిగా రచ్చ ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా వర్కాల శ్రావణ్ కుమార్, ఉపాధ్యక్షులుగా వనం రాఘవేంద్ర, సామిడి శ్రీనివాస్ రెడ్డి, పన్నాల శ్రీకాంత్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా కలకొండ శ్రీనివాస్, అన్నదానం కార్యదర్శిగా ఏలే మురళి, కోశాధికారిగా నల్లెంకీ శేఖర్ గౌడ్ లు ఎన్నికయ్యారు. అదే విధంగా కార్యవర్గ సభ్యులుగా ఇప్ప లక్మణ్, భోగ సుధాకర్, ఎర్రగుంట శ్రీకాంత్, గట్టు హరి సుందర్, ఆకిటి నవీన్ రెడ్డి, రాపోలు సోమ శేఖర్, వంగరి రవీందర్ లు ఎన్నికయ్యారు. ఈ నెల 12వ తేదీ నుంచి కొయ్యలగూడెం శ్రీ శ్రీ శ్రీ వరసిద్ధి వినాయక (వాయు మండల గణపతి) దేవాలయంలో అయ్యప్ప మలాదారులకు నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

## పంచశీల పాఠశాలలో ఘనంగా వందే మాతరం గేయం



కూకట్పల్లి, (ప్రజాస్ఫూర్తి) : వందే మాతరం గేయం రూపొంది 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం మూసాపేటలోని పంచశీల స్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వందేమాతరం ఆకారంలో కూర్చొని వందేమాతరాన్ని ఆలపించి తమ దేశభక్తిని చాటారు.

## బనకచర్లపై వెనక్కి తగ్గిన ఏపీ... టెండర్లు రద్దు

బనకచర్లపై ఏపీ వెనక్కి తగ్గినట్టు కనిపిస్తోంది. పోలవరంబనకచర్ల లింక్ ప్రాజెక్టు నిర్మాణానికి DPR కోసం చేపట్టిన టెండర్ల ప్రక్రియను రద్దు చేస్తున్నట్లు ఏపీ ప్రకటించింది. హైదరాబాద్ లో జరిగిన పోలవరం అథారిటీ సమావేశంలో ఈ అంశాన్ని వెల్లడించింది. అంతర్రాష్ట్ర నదీజలాల ఒప్పందాలకు విరుద్ధంగా ఏపీ ఈ ప్రాజెక్టును చేపడుతోందని తెలంగాణ తొలినుంచి వ్యతిరేకిస్తూ వచ్చింది. దీనిపై కేంద్రానికి, CWCకి ఫిర్యాదు చేసింది. న్యాయపోరాటానికీ సిద్ధమైంది. దీంతో AP ఈ ప్రకటన చేసింది. ఫలితంగా పోలవరం బనకచర్ల ప్రాజెక్టు లేనట్టేనని అభిప్రాయపడుతున్నారు నిపుణులు. అయితే ఈ ప్రాజెక్టుపై ఇరు రాష్ట్రాలకు ఎలాంటి వివాదం రాకుండా మరో ప్రణాళికతో కూడా ఏపీ ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నట్టు చెబుతున్నారు.

## విద్యార్థి అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమిద్దాం

*** పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కె. గణేష్**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : విద్యా వ్యవస్థలో సమూల మార్పుల కోసం అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కె. గణేష్ అన్నారు. విద్యార్థి అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రాష్ట్ర కార్యవర్గ పిలుపులో మేరకు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రైవేట్ విద్యా సంస్థల్లో శుక్రవారం విద్యార్థి అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. జిల్లా నాయకులు అరుణ్ అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా కార్యదర్శి జె గణేష్ పాల్గొని మాట్లాడుతూ శాస్త్రీయ విద్యాసాధన, సమ సమాజ స్థాపన కోసం నక్సల్బరీ, శ్రీకాకుళం, గోదావరిలోయ పోరాటాల ప్రేరణతో ఉస్మానియా అరుణతార, జార్జిరెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ కొదమసింహం జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, రంగవల్లి, స్నేహలత మధుసూదన్, వీరన్న లాంటి ఎందరో విద్యార్థి వీరులు పోరాడాన్నారు. సమాజ మార్పు కోసం, దోపిడి, పీడన లేని వ్యవస్థ కోసం, ప్రతి ఒక్కరికి సమాన, ఉచిత, నాణ్యమైన విద్య అందాలన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలను పెంచి పోషించి విద్యను వ్యాపారీకరణ చేసి పేదవానికి విద్యను అందరిని ద్రాక్షగా మార్చారని విమర్శించారు. అందరికీ ఉచిత, సమాన, నాణ్యమైన విద్య కొరకు ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అసమానతలు లేని సమాజ నిర్మాణం కొరకు శాస్త్రీయ విద్య సాధన ధ్యేయంగా, సమ సమాజ లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రవళిక, పల్లవి, చరణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టరేట్‌లో వందేమాతర గీతాలాపన

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:వందేమాతర గీతం 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్ నందు శుక్రవారం జాతీయ గీతాలాపన చేశారు. భారత జాతీయ గీతం "వందేమాతరం" రచయిత బంకించంద్ర చటర్జీ ఈ కీర్తి గీతాన్ని రచించిన సందర్భంగా ఆ ఘట్టాన్ని దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన ఆదేశాల మేరకు, జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఉదయం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో సామూహికంగా వందేమాతరం గేయాలాపన కార్యక్రమం నిర్వహించబడింది. దీనిలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ జితేష్ వి. పాటిల్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదన కలెక్టర్ విద్యా చందన, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొని వందేమాతరం గేయాన్ని సమూహంగా ఆలపించారు. ఈ సందర్భంగా అధికారులంతా దేశభక్తి, ఐక్యత, స్ఫూర్తిని ప్రతిబింబించే ఈ గేయం భారత స్వాతంత్ర్య సమరంలో పోషించిన విశిష్ట పాత్రను స్మరించుకున్నారు.

**పోలీస్ శాఖ ఆధ్వర్యంలో...**

జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సామూహిక జాతీయ గీతాలాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్, జిల్లా పోలీస్ కార్యాలయంతోపాటు అన్ని పోలీస్ స్టేషన్లలో వందేమాతర గేయాన్ని అధికారులు, సిబ్బంది ఆలపించారు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తినిచ్చి ఇప్పటికీ జాతీయ గౌరవాన్ని, ఐక్యతను పెంపొందిస్తున్న వందేమాతర గీతం 150 సంవత్సరాల వేడుకలలో భాగంగా సామూహికంగా ఆలపించడం జరిగింది.

## భారత్ వికాస్ చారిటబుల్ ట్రస్ట్ వారిచే కృత్రిమ కాలు ఏర్పాటు

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : సిద్దిపేట జిల్లా చిట్యాల గ్రామానికి చెందిన పోచయ్యకు గత సంవత్సర క్రితం కాలు తీసేయడం జరిగింది. ఆర్టిఫిషియల్ కాలు పెట్టించమని తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర కమిటి కోరగ వారు స్పందించి శుక్రవారం కూకట్ పల్లి లోని భారత్ వికాస్ చారిటబుల్ ట్రస్ట్ వారిచే కృత్రిమ కాలు పెట్టించారు. అనంతరం ట్రస్టు సభ్యులైన నరేందర్, మధు, స్వామి , రఘు ను తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి సభ్యులు శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కిరణ్ గుత్తికొండ, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మెరుగు శివకృష్ణ ,హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు పెద్దగుల్ల నాగరాజు, మహిళా నాయకురాలు యశోద గోద పాల్గొన్నారు.






## ప్రాణాలు పోయేదాకా రహదారులు ఇంతేనా

*** బిఆర్ఎస్ నాయకులు దిండిగాల రాజేందర్.**



ప్రజా స్ఫూర్తి, ఇల్లందు : రహదారుల మరమ్మత్తులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ నాయకులు దిండిగాల రాజేందర్ నాయకత్వంలో ఇల్లందు ఎం ఎల్ ఏ క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. శుక్రవారం బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగ కాంతారావు పిలుపు మేరకు జిల్లాలోని రహదారులు అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ బి ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు ఇల్లంది ఏం ఎల్ ఏ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా దిండిగాల రాజేందర్ మాట్లాడుతూ వాహనాల మీద టాక్సీలు పెంచి డబ్బులు గుంజుతున్న ప్రభుత్వం రోడ్లను మరమ్మత్తులు చేయటంలో విఫల అయ్యిందని ఈ కారణంగా రోడ్డుమీద వాహనాలు నడిపే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారనీ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు కావస్తున్నా రోడ్లమీద తట్టెడు మట్టి పోసిన పాపాన పోలేదని విమర్శించారు. జిల్లాలో డీఎంఎఫ్టి నిధులు పుష్కలంగా ఉన్నా వాటిని రోడ్ల అభివృద్ధి వైపు మళ్లించలేకపోవటం శిచయనీయమని తెలిపారు. ఇప్పటికైనా ఎం ఎల్ ఏ గారు బాధ్యత తీసుకొని రోడ్లను వెంటనే అభివృద్ధి చేయాలని తెలిపారు. క్యాంప్ కార్యాలయంలో ఎం ఎల్ ఎ సిబ్బంది అందుబాటులో లేకపోవటంతో అక్కడే ధర్నా నిర్వ హించి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్. రంగనాథ్, టీబీజీకే ఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ, ఎస్. కే నబీ, పట్టణ ఉపాధ్యక్షులు, చీమల సత్యనారాయణ, టేకులపల్లి ఉపాధ్యక్షులు, బావ్ సింగ్ మాజీ ఆత్మ కమిటీ చైర్మన్, ఎర్రబెల్లి కిష్టయ్య, ఉద్యమ నాయకులు, వసంతరావు నారపాక, లలిత్ కుమార్ పాసి, మూలగుండ్ల ఉపేందర్ రావ్ పరక పల్లి రవిగౌడ్,రాంలాల్, వీరస్వామి ,రాచపల్లి శ్రీను నారపకా యాకయ్య, సనా రాజేష్, అందూరి, ప్రసాద్, ఎస్ కే బి బి, నూర్జాన్, మదర్ బి, శ్యామ్, సుందరగిరి శీను, తుంగపల్లి, తాండ్ర వంశి, పుచ్చకాయల ఉదయ్ కుమార్, సునీల్ అన్న ,శ్రీకాంత్, ఎం చంటి ఎండి జాలిన్, ముత్తయ్య, గడ్డం వెంకన్న, చీమల శ్రీను, ఇమ్రాన్, శివ, ఇమ్రాన్ గోల్డ్ చిన్నారి, రసూల్, హరిప్రసాద్ యాదవ్, కమ్రు, కాజా, బాబా, విజయ్, రాజు నాగేశ్వరరావు, సాయి కుమార్ ,వీరు ,శివ కృష్ణ, సత్యవతి, ముత్తమ్మ, నారాయణమ్మ, భాయమ్మ, ఈశ్వరమ్మ సాయి, రాంబాబు, పట్టణ నాయకులు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో బంద్ విరమించిన ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు

హైదరాబాద్: తెలంగాణలో ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో చర్చల అనంతరం బంద్ విరమిస్తున్నట్టు ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ప్రకటించింది. ప్రైవేటు కాలేజీలకు ఫీజు బకాయిలు చెల్లింపునకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. యాజమాన్యాలు కోరిన రూ.1,500 కోట్ల బకాయిలలో రూ.600 కోట్లు ఇప్పటికే విడుదల చేయగా, మరో రూ.600 కోట్లు తక్షణమే విడుదల చేస్తామని, మిగిలిన రూ.300 కోట్లు కూడా త్వరలో క్లియర్ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్, ఫార్మసీ తదితర వృత్తి విద్యా కళాశాలలతో పాటు డిగ్రీ, పీజీ కళాశాలలు ఈనెల 3వ తేదీ నుంచి బంద్ కారణంగా మూతబడ్డాయి. ప్రభుత్వంతో కాలేజీల యాజమాన్యాలు జరిపిన చర్చలు సఫలం కావడంతో కళాశాలలు యథావిధిగా తెరుచుకోనున్నాయి. ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ఛైర్మన్ రమేష్ బాబు, పలువురు ఉన్నతాధికారులు చర్చల్లో పాల్గొన్నారు.



## ఎన్నికల సమయంలో
# సోదాలు సహజం: పొన్నం



హైదరాబాద్: హైదరాబాద్‌లో భారత రాష్ట్ర సమితి నేతల ఇళ్లలో ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ సోదాలు చేపట్టింది. ఈ అంశంపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. ఎన్నికల సమయంలో సోదాలు సహజమని.. ఎవరి ఇంట్లో అయినా అధికారులు తనిఖీలు చేస్తారని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం పరిధిలో ఫ్లయింగ్ స్క్వాడ్ పనిచేస్తుందని తెలిపారు. ఎవరిపైనైనా ఫిర్యాదులు వస్తే సోదాలు చేయడం ఎన్నికల సంఘం హక్కు అని తెలిపారు. ప్రతిదాన్ని రాజకీయం చేయడం గులాబీ పార్టీ నేతలకు అలవాటైందని విమర్శించారు. ఇక జూబ్లీహిల్స్‌లో 10 వేల ఓట్లు కూడా భాజపాకు రావని పొన్నం ఎద్దేవా చేశారు. కిషన్‌రెడ్డి నియోజకవర్గంలోనే ఆ పార్టీని ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ ఎన్నికల్లో భాజపా భారత రాష్ట్ర సమితి లోపాయికారి ఒప్పందం చేసుకున్నాయని ధ్వజమెత్తారు.

## ఉన్నత విద్యాసంస్థల వినతిపై
# వారంలోగా నిర్ణయం తీసుకోండి: హైకోర్టు

హైదరాబాద్: ప్రైవేటు ఉన్నత విద్యాసంస్థలు దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ ముగించింది. దరఖాస్తును పరిశీలించి వారంలో నిర్ణయం తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం పోరాటంలో భాగంగా హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో 'సాంత్వన సభ' నిర్వహించేందుకు ఉన్నతా విద్యాసంస్థల సమాఖ్య దరఖాస్తు చేసుకుంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఉన్నందున సాంత్వన సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య హైకోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలు చేసింది. పోలీసుల నుంచి వివరాలు తీసుకోవాల్సి



ఉందని హోంశాఖ జీపీ మహేశ్.. విచారణ సందర్భంగా కోర్టుకు తెలిపారు. బండ్లగూడలోని అరోరా కళాశాలలో సభ పెట్టుకుంటామని సమాఖ్య తరపు న్యాయవాది తెలిపారు. ఎక్కడ సభ పెట్టుకోవాలన్నా పోలీసుల అనుమతి తప్పనిసరి అని హోంశాఖ జీపీ స్పష్టం చేశారు. ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం.. వారంలో పోలీసులు నిర్ణయం తీసుకోవాలని ఆదేశిస్తూ పిటిషన్‌పై విచారణ ముగించింది.

**సాంత్వన సభ వాయిదా..**

హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఈనెల 8న నిర్వహించ తలపెట్టిన సాంత్వన సభ వాయిదా వేసినట్టు ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య ప్రకటించింది. హైకోర్టు సూచనల మేరకు ఈనెల 14వరకు సభను వాయిదా వేస్తున్నట్టు తెలిపింది.

# హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల భారీ ఆపరేషన్..
## ఒక్క నెలలో 55 మంది అరెస్టు

హైదరాబాద్: సైబర్ నేరగాళ్ల ఆగడాలను అరికట్టేందుకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. అక్టోబర్ నెలలో 196 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి.. 55 మందిని అరెస్టు చేశారు. బాధితులకు రూ.62.34 లక్షలు అప్పగించారు. సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాల్లో రూ.107 కోట్ల లావాదేవీలు గుర్తించారు. వివిధ కేసుల్లో 8 రాష్ట్రాలకు చెందిన 55 మంది సైబర్ మోసగాళ్లను అరెస్టు చేసినట్లు శుక్రవారం పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. చైనా పౌరుల ద్వారా డిజిటల్ అరెస్టు స్కామ్ చేస్తున్నట్లు గుర్తించారు. 62 ఏళ్ల వృద్ధుడి నుంచి రూ.1.07 కోట్లు దోచుకున్న ముఠాను సైబర్ క్రైమ్ పోలీసులు గత నెలలో అరెస్టు చేశారు. అదృశ్యమైన ఫోన్ ద్వారా ముగ్గురు నిందితులు



రూ.1.95 లక్షలు దోచుకోగా వారిని కూడా అరెస్టు చేశారు. ఏపీలో ఫేక్ ట్రేడింగ్ యాప్‌తో రూ.24.17 లక్షలు మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేశారు. ఇన్వెస్ట్‌మెంట్, డిజిటల్ అరెస్టు, సోషల్ మీడియా ఫ్రాడ్‌ల ద్వారా 33 సైబర్ మోసాలు జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల నుంచి 31 సెల్‌ఫోన్లు, 14 చెక్‌బుక్‌లు, 9 డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు.

# కాంగ్రెస్ పాలనలో నలుగురు బ్రదర్స్ మాత్రమే హ్యాపీగా ఉన్నారు: హరీశ్‌రావు

హైదరాబాద్: జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలిస్తే మూడేళ్లపాటు నరకయాతన అనుభవించాల్సి ఉంటుందని మాజీమంత్రి హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. వికాసానికి.. విధ్వంసానికి మధ్య జరుగుతున్న ఎన్నికల్లో ఏది కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో ఏ ఒక్క వర్గం కూడా సంతృప్తిగా లేదన్నారు. కాంగ్రెస్ పాలనలో నాలుగు కోట్ల ప్రజలు కాదు.. నలుగురు బ్రదర్స్ మాత్రమే హ్యాపీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. హామీ ఇచ్చిన గ్యారంటీలు ఎగ్గొట్టిన ప్రభుత్వం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అని హరీశ్‌రావు మండిపడ్డారు. సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో జరిగిన మీట్ ది ప్రెస్‌లో ఆయన మాట్లాడారు. బ్లాక్ మెయిల్ చేసి జూబ్లీహిల్స్‌లో ఓట్లు వేయించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి చూస్తున్నారని హరీష్ రావు ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటు వేయకుంటే.. రేషన్ కార్డులు ఆగిపోతాయి అని అంటున్నారని మండిపడ్డారు. కంటోన్మెంట్‌లో 6 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఎక్కడని ప్రశ్నించారు. ప్రజలను మభ్యపెట్టి కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ గెలిచిందన్నారు. రెండేళ్లుగా అజహరుద్దీన్‌కు మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. సినీ హీరోలను జైల్లో పెట్టిన రేవంత్ రెడ్డి.. సినీ కార్మికులకు ఒంగి ఒంగి దండాలు పెడుతున్నారంటూ ఎద్దేవా చేశారు. పీజేఆర్‌పై ప్రేమ ఉంటే.. 2023లో పీజేఆర్ కుమారుడికి ఎందుకు టికెట్ ఇవ్వలేదని ప్రశ్నించారు.



## కారును తప్పించబోయి..
# డివైడర్‌ను దాటి దూసుకొచ్చిన ఆర్టీసీ బస్సు



ఘట్‌కేసర్: జనగామ నుంచి ఉప్పల్ వస్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. ఘట్‌కేసర్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఔశపూర్ వద్ద కారును తప్పించబోయి బస్సు డివైడర్‌ను దాటి మరో రూట్లోకి దూసుకువచ్చింది. ప్రమాద సమయంలో బస్సులో 38 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ప్రమాదం నుంచి ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు. ఘటనాస్థలిని పోలీసులు పరిశీలించారు.

# సుజలాం.. సుఫలాం.. సస్యశ్యామలం.. వందేమాతరం!

* స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్ల మంది భారతీయుల్లో స్ఫూర్తి నింపిన 'వందేమాతరం' గేయానికి శుక్రవారంతో 150 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా తెలుగు రాష్ట్రాల్లో వాడవాడన ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.















# డిసెంబర్‌లో హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్: తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. దాదాసాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్టడీ సంస్థ ద్వారా డిసెంబర్ 19 నుంచి 21 వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందుకు ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రూ.30



లక్షలు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాలతో రాష్ట్రప్రభుత్వం ఈమేరకు జీవో విడుదల చేసింది.

# హైదరాబాద్‌లోని BRS నేతల ఇళ్లలో సోదాలు



హైదరాబాద్: నగరంలోని భారత రాష్ట్ర సమితి నేతల ఇళ్లలో ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ సోదాలు చేసింది. మోతీనగర్‌లోని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి నివాసంలో, రెహమత్ నగర్‌లోని ఎమ్మెల్సీ రవీందర్‌రావు ఇంట్లో ఎన్నికల అధికారులు తనిఖీలు చేపట్టారు. ఎన్నికల కోసం భారీ ఎత్తున డబ్బు నిల్వ చేశారనే ఫిర్యాదులతో ఈ సోదాలు చేశారు. ఎన్నికల అధికారులతో పాటు కేంద్ర బలగాలు ఇందులో పాల్గొన్నాయి.

# దిల్లీ ఎఫెక్ట్.. ముంబయితో సహా దేశవ్యాప్తంగా విమానాలు ఆలస్యం

సాంకేతిక సమస్య కారణంగా దిల్లీలో వందలాది విమానాల రాకపోకలపై ప్రభావం పడిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ముంబయి లోనూ అదే పరిస్థితి ఎదురైంది. ఈ మేరకు ఛత్రపతి శివాజీ మహారాజ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ అడ్వైజరీ జారీ చేసింది. దిల్లీలో ఆటోమేటిక్ మెసేజ్ స్విచింగ్ సిస్టమ్‌లో సాంకేతిక సమస్య కారణంగా విమాన కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడిందని వెల్లడించింది. విమానాలు ఆలస్యంగా నడిచే అవకాశం ఉందని ప్రయాణికులను అప్రమత్తం చేసింది. అప్‌డేట్ల కోసం సంబంధిత ఎయిర్‌లైన్స్‌ను సంప్రదించాలని సూచించింది. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని తన ప్రకటనలో పేర్కొంది. ఆటోమేటిక్ మెసేజ్ స్విచింగ్ సిస్టమ్ లో సాంకేతిక సమస్య వల్లే అంతరాయం ఏర్పడిందని



ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఇప్పటికే వెల్లడించింది. దీన్ని పరిష్కరించేందుకు సాంకేతిక బృందాలు ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది. దిల్లీ ఎయిర్‌పోర్టు కూడా ఇదే విషయాన్ని వెల్లడిస్తూ సామాజిక మాధ్యమంలో పోస్టు చేసింది. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్టు టెర్మినళ్ల లోపల, బోర్డింగ్ గేట్ల వద్ద భారీ సంఖ్యలో ప్రయాణికులు క్యూలో వేచిచూడాల్సి వస్తోంది. ఈ సమస్యకు సైబర్ దాడి ఏమైనా కారణమా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సాంకేతిక సమస్య కారణంగా ముంబయితో పాటు జైపుర్, లఖ్‌నవూ, వారణాసి, ఇతర అంతర్జాతీయ విమానాశ్రయాల్లో కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడుతోంది. దిల్లీ నుంచి ఈ ఎయిర్‌పోర్టులకు వచ్చే విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి.

## 'మ్యాజిక్ బాక్స్'తో చిన్నారులకు వినూత్న బోధన!



ముంబయి: పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకుగాను బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ కృషి చేస్తోంది. ఈ క్రమంలో కేజీ నుంచి రెండో తరగతి విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన 'మ్యాజిక్ బాక్స్' ఎంతో దోహదం చేస్తోంది. 202021 నుంచి బీఎంసీ పరిధిలోని వందలాది పాఠశాలల్లో ఈ విద్యా విధానాన్ని అమలు చేస్తున్నారు. ప్రస్తుతం 70 వేల మంది విద్యార్థులు ప్రయోజనం పొందుతున్నట్లు అధికారులు వెల్లడించారు. చిన్నారులు అక్షరాలు, సంఖ్యలను తేలికగా గుర్తుపట్టేందుకు వీలుగా బీఎంసీ 200708లో కొత్త విధానాన్ని రూపొందించింది. లేసింగ్ బోర్డులు, టచ్ కార్డులు, కౌంటింగ్ బెడ్స్, రంగురంగుల ఐస్‌క్రీమ్ పుల్లల కిట్లు, ఫింగర్ పప్పెట్స్ తదితర వస్తువులతో చిన్నారులకు బోధించడం మొదలుపెట్టారు. ఆ తర్వాత ఎన్‌సీఈఆర్‌టీ సహకారంతో 'మ్యాజిక్ బాక్స్'కు రూపకల్పన చేశారు. ఈ విధానాన్ని అన్ని రాష్ట్రాలు అమలు చేయాలని 2022లో కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు బీఎంసీ పరిధిలోని మున్సిపల్ స్కూళ్లలో ఈ ప్రాజెక్టును విస్తృతంగా చేపడుతున్నారు. సంఖ్యలు, అక్షరాల రూపంలో ఇవి ఉండటం వల్ల చిన్నారులకు చదవడం, రాయడం తేలికవుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పజిల్స్, పుస్తకాలు, భిన్న ఆకృతుల్లో ఉన్న బొమ్మలతో గణితాన్ని అర్థం చేసుకోవడం సులభమవుతుంది. ఇలా ఆహ్లాదకరమైన వాతావరణంలో పాఠాలు నేర్చుకునేందుకు ఈ విధానం ఎంతో దోహదపడుతుందని ఉపాధ్యాయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఏకంగా ఎంపీకే టోకరా.. నకిలీ కేవైసీతో రూ.56లక్షలు కాజేసి



ఏకంగా ఓ పార్లమెంట్ సభ్యుడినే సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. ఆయన ఖాతా నుంచి రూ.56 లక్షలు దోచేశారు. నకిలీ కేవైసీతో వారు ఈ నేరానికి పాల్పడ్డారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. తృణమూల్ కాంగ్రెస్ నేత, పార్లమెంట్ సభ్యుడు కల్యాణ్ బెనర్జీ సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కారు. పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ బ్రాంచ్ ఖాతా నుంచి డబ్బు దోచేశారు. దీనిపై బ్యాంకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. బెనర్జీ ఖాతాకు సంబంధించిన కేవైసీని అప్‌డేట్ చేయడానికి మోసగాళ్లు నకిలీ పాన్, ఆధార్ కార్డులను ఉపయోగించారు. ఖాతాలకు లింక్ అయిన రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌ను మార్చారు. ఈ వివరాలన్నీ మారిన తర్వాత ఇంటర్నెట్ బ్యాంకింగ్ సదుపాయం ద్వారా పలుమార్లు లావాదేవీలు నిర్వహించారు. మొత్తం రూ.56 లక్షలు కాజేశారు. వాటిని వేర్వేరు ఖాతాలకు బదిలీ చేసి, బంగారం కొనుగోలు చేసినట్లు సమాచారం. కొంతమొత్తాన్ని ఏటీఎంల ద్వారా విత్‌డ్రా చేసుకున్నారని తెలుస్తోంది. అయితే సైబర్ నేరగాళ్ల బారిన పడిన ఖాతా కొంతకాలంగా యాక్టివ్‌లో లేదు. కల్యాణ్ బెనర్జీ ఎమ్మెల్యేగా ఉన్న (2001 నుంచి 2006) సమయంలో దానిని ఓపెన్ చేశారని, చట్టసభ సభ్యుడిగా ఆయనకు వచ్చిన వేతనం అందులోనే క్రెడిట్ అయిందని జాతీయ మీడియా కథనాలను బట్టి తెలుస్తోంది. ఆ తర్వాత నుంచి యాక్టివ్‌గా లేని ఖాతాలో ఇటీవల కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. దీనిని గుర్తించిన ఎంపీ వెంటనే బ్యాంకు అధికారులను అప్రమత్తం చేయడంతో వారు సైబర్ క్రైమ్ కింద ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు జరుగుతోందని కోల్‌కతా సైబర్ క్రైమ్‌కు చెందిన ఉన్నతాధికారి మీడియాకు వెల్లడించారు.

## బంగారు, వెండి బల్లుల తాపడాలు మారలేదు: కంచి ఆలయం



చెన్నై: తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాంచీపురంలోని వరదరాజ పెరుమాళ్ ఆలయంలో బల్లుల విగ్రహాలకు ఉన్న తాపడాలను మార్చినట్లు ఫిర్యాదు అందడం తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా ఆలయ మేనేజ్‌మెంట్ స్పందిస్తూ ఆరోపణలను తోసిపుచ్చింది. ఆ విగ్రహాల్లో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేసింది. ''ఆలయంలోని బంగారు, వెండి బల్లుల విగ్రహాలు సీలింగ్‌కు అలాగే ఉన్నాయి. వాటిని తొలగించడం గానీ.. తాపడాలను మార్చడం గానీ చేయలేదు. దీనిపై ఆలయాల ఉద్యమకారుడు తప్పుడు, నిరాధార ఆరోపణలు చేశారు. ఆయనపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించాం'' అని ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి శుక్రవారం వెల్లడించారు. కాంచీపురంలోని వరదరాజ పెరుమాళ్ ఆలయంలో ప్రస్తుతం పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. ఈ సమయంలో ఆలయంలోని పురాతన బంగారు, వెండి బల్లుల తాపడాలను మార్చేసి వాటి స్థానంలో కొత్త తాపడాలను ఏర్పాటుచేశారని శ్రీరంగానికి చెందిన రంగరాజ నరసింహ ఫిర్యాదు చేశారు. దీంతో విగ్రహాల అక్రమ తరలింపు నిషేధ విభాగం పోలీసులు దీనిపై దర్యాప్తు చేపట్టారు. ఈనేపథ్యంలో బుధవారం ఆలయ ఈవో రాజ్యలక్ష్మిని పోలీసులు 8 గంటల పాటు విచారించారు. ఆలయంలోని ఇతర సిబ్బందిని కూడా ప్రశ్నించారు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోంది. అవసరమైనప్పుడు విచారణకు రావాలని ఆలయ ఈవో, సిబ్బందిని ఆదేశించినట్లు తెలిసింది. 108 దివ్య క్షేత్రాల్లో ఒకటైన కాంచీపురంలోని ఈ ప్రసిద్ధ వరదరాజస్వామి ఆలయంలో బంగారు, వెండి బల్లులు విశిష్టమైనవి. నిత్యం ఈ ఆలయాన్ని దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులు దర్శించుకుంటారు. ఇక్కడి బంగారు, వెండి బల్లులను తాకితే దోషనివారణ జరుగుతుందని నమ్మకం.

## విజయ్.. గాల్లో మేడలు కడుతున్నారు - వైగో



టీవీకే అధినేత విజయ్‌పై ఎండీఎంకే చీఫ్ వైగో తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పోటీ టీవీకేడీఎంకే మధ్యే ఉండనుందని టీవీకే నేత చెప్పడంపై ఘాటుగా స్పందించారు. ఆయనకు రాజకీయాల్లో కనీసం ఓనమాలు కూడా తెలియవని, గాల్లో మేడలు కట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. తమిళనాడు సీఎం స్టాలిన్‌పై విజయ్ విమర్శలు గుప్పించడంపై వైగో తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ''ఆయన (విజయ్) ఇప్పటికే ముఖ్యమంత్రి అయినట్లుగా మాట్లాడుతున్నారు. రాజకీయాల్లో ఓనమాలు కూడా తెలుసుకోకుండా.. పేపరు పడవపై సముద్రాన్ని దాటేందుకు ప్రయత్నిస్తున్నారు. గాల్లో మేడలు కట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయన కలలన్నీ ఎండమావిలా మారతాయని ఇదివరకే చెప్పా'' అని విజయ్ పేరు ప్రస్తావించకుండానే వైగో పరోక్ష విమర్శలు చేశారు. కరూర్ తొక్కిసలాట ఘటనలో బాధితులను విజయ్ మహాబలిపురంలోని ఓ రిసార్టుకు ఆహ్వానించడంపై వైగో మండిపడ్డారు. బాధిత కుటుంబాలను వారి నివాసాల్లోనే పరామర్శించకుండా రిసార్టుకు పిలిపించుకోవడం సిగ్గుచేటని అన్నారు. తమిళనాడు చరిత్రలో ఇటువంటి పరిణామం చూడలేదని, ఇదో కుట్ర అని ఆరోపించారు. గతంలో తూత్తుకుడిలో నిరసనల సందర్భంగా పోలీసుల కాల్పుల్లో 13 మంది చనిపోతే.. బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి తాను పరామర్శించానని గుర్తుచేశారు. ఇదిలా ఉంటే, డీఎంకే ప్రభుత్వంలో వైగో నేతృత్వంలోని ఎండీఎంకే భాగస్వామ్యపక్షంగా ఉన్న సంగతి తెలిసిందే.

## ఆ ప్రమాదం.. మీ కుమారుడి తప్పిదం కాదు

### ఎయిరిండియా దుర్ఘటనపై సుప్రీంకోర్టు



అహ్మదాబాద్‌లో చోటు చేసుకున్న ఎయిరిండియా విమాన ప్రమాదం మొత్తం దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి ప్రమాదంలో మరణించిన ప్రధాన పైలట్ సుమీత్ సభర్వాల్ తండ్రి పుష్కరాజ్ సభర్వాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఈ క్రమంలో కేంద్రం, డీజీసీఏలకు నోటీసులు జారీ చేసింది. ఎయిరిండియా ప్రమాదంలో మృతి చెందిన 260 మందిలో కెప్టెన్ సుమీత్, కోపైలట్ క్లైవ్ కుందర్‌లు కూడా ఉన్నారు. ఈ కేసును న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు కోరుతూ.. సుమీత్ తండ్రి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రమాదానికి గల కారణాన్ని నిర్ధరించడంతోపాటు ఘటనపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని ఆయన డిమాండ్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. దీని విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'ఈ ప్రమాదం జరగడం చాలా దురదృష్టకరం. మీ కుమారుడిని నిందిస్తున్న భారాన్ని మీరు మోయకూడదు. అతడిని ఎవరూ నిందించలేరు. ఈ ప్రమాదానికి పైలట్‌ల తప్పిదమే కారణమని దేశంలో ఎవరూ విశ్వసించడం లేదు. ఆయనపై అలాంటి ఆరోపణలు రాలేదు. ప్రమాదంపై జరిగిన ప్రాథమిక దర్యాప్తులో ఇద్దరు పైలట్ల మధ్య సంభాషణ మాత్రమే బయటకు వచ్చింది' అని పేర్కొంది. ఈ క్రమంలోనే పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని కోరుతూ కేంద్రం, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తో పాటు ఇతర అధికారులకు నోటీసులు జారీ చేసింది. దీనిపై తదుపరి విచారణ నవంబరు 10కి వాయిదా వేసింది.

## రహస్య అణు కార్యక్రమాలు పాకిస్థాన్‌కు అలవాటే! - భారత్



ప్రపంచంలో అణ్వాయుధాలను పరీక్షిస్తున్న దేశాల్లో పాకిస్థాన్ కూడా ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై భారత్ స్పందించింది. ఆ వ్యాఖ్యలను నిశితంగా పరిశీలిస్తున్నామని తెలిపింది. రహస్యంగా, చట్టవిరుద్ధంగా అణు కార్యకలాపాలు కొనసాగించడంలో పాకిస్థాన్‌కు దశాబ్దాల చరిత్ర ఉందని స్పష్టం చేసింది. స్మగ్లింగ్, ఎగుమతి నియంత్రణ ఉల్లంఘనలు, రహస్య భాగస్వామ్యాలు దశాబ్దాలుగా పాకిస్థాన్‌కు అలవాటేనని, ఏకే ఖాన్ నెట్‌వర్క్ విస్తరణ చుట్టూ ఇది కేంద్రీకృతమైందని భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. ఈ అంశాలను అంతర్జాతీయ సమాజం దృష్టికి భారత్ ఎల్లప్పుడూ తీసుకెళ్తూనే ఉంటుందన్నారు. వచ్చే ఏడాది భారత్‌లో పర్యటిస్తానని ట్రంప్ చేసిన ప్రకటన గురించి అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. దీనిపై ప్రస్తుతానికి తమకు ఎటువంటి సమాచారం లేదన్నారు. ప్రపంచంలో చాలా దేశాలు చురుగ్గా అణ్వాయుధాలను పరీక్షిస్తున్నాయని, ఆ జాబితాలో పాకిస్థాన్ ఉందని అమెరికా అధ్యక్షుడు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. రష్యా, చైనా, ఉత్తరకొరియా, పాకిస్థాన్ వంటి దేశాలు అణు పరీక్షలను నిర్వహిస్తున్నాయని, వాళ్లెవ్వరూ ప్రశ్నించరని అన్నారు. తాము మాత్రం బహిరంగంగానే చెబుతామన్నారు. ఇన్నాళ్లూ ఎన్ని దేశాలు అణు పరీక్షలు చేపట్టినా వాటి జోలికి వెళ్లలేదని.. ఇకపై అలా మిగిలిపోవాలనుకోవట్లేదన్నారు. ఇతర దేశాల మాదిరిగానే తామూ అణు పరీక్షలు నిర్వహిస్తామని ట్రంప్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

## వీధి కుక్కల కేసు.. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు



వీధి కుక్కల కేసులో శుక్రవారం సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. విద్యాసంస్థలు, బస్, రైల్వే స్టేషన్లు, క్రీడా సముదాయాలు, ఇతర బహిరంగ ప్రదేశాల సమీపం నుంచి వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. అలాగే అవి ఈ ప్రదేశాల లోపలికి వెళ్లకుండా కంచెలు వేయాలని సూచించింది. ఈ ప్రాంగణాల్లో కుక్కలు లేవని నిర్ధరించుకునేందుకు క్రమంతప్పకుండా తనిఖీలు చేయాలని తన ఆదేశాల్లో పేర్కొంది. ఏ కారణం చేతనైనా మళ్లీ వాటిని పట్టుకొన్నచోటే వదిలివేయొద్దని ఆదేశించింది. కుక్కల తరలింపునకు కోర్టు 8 వారాల సమయం ఇచ్చింది. జాతీయ రహదారులపై తిరుగుతున్న ఆలనాపాలనా లేని పశువులను షెల్టర్లకు తరలించాలని సూచించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, జాతీయ రహదారుల శాఖ, స్థానిక సంస్థలు హైవే గస్తీ బృందాలకు ఆదేశాలు ఇచ్చింది. అలాగే తదుపరి విచారణను జనవరి 13కు వాయిదా వేసింది.

**అసలు ఏం జరిగిందంటే..?**

వీధి కుక్కల దాడుల వల్ల దిల్లీ, ఎన్సీఆర్ పరిధిలో రేబిస్ మరణాల సంఖ్య పెరుగుతోందని వచ్చిన వార్తలను పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ పార్డీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం 8 వారాల్లోపు అన్ని వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని ఆగస్టు 11న ఆదేశించింది. దానిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఆ నేపథ్యంలో జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజరియాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం దానిని విచారించింది. ఆ సందర్భంగా రేబిస్ లక్షణాలు లేదా విపరీత ప్రవర్తన కలిగిన కుక్కలు మినహా ఇప్పటివరకు షెల్టర్లకు తరలించిన వాటిని విడుదల చేయాలని ఆదేశాలు జారీచేసిన సంగతి తెలిసిందే. వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేసిన తర్వాత వాటిని ఎక్కడినుంచి తీసుకొచ్చారో అక్కడే విడిచిపెట్టాలని పేర్కొంటూ.. ఆగస్టు 11న ఇచ్చిన తీర్పును సవరించింది. అయితే ఇప్పుడు కుక్కలను మళ్లీ వెనక్కి తీసుకురాకుండా ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. అలాగే వాటికి ఆహారం అందించేందుకు స్థానిక సంస్థలు ప్రత్యేకంగా ఫీడింగ్ స్పేస్‌ను ఏర్పాటుచేయాలని ఆదేశించింది. బహిరంగంగా ఆహారం అందించడానికి అనుమతి లేదని, ఒకవేళ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని తేల్చిచెప్పింది.

## వందేమాతరానికి 150 ఏళ్లు.. దేశవ్యాప్తంగా గేయాలాపన

దిల్లీ: స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్ల మంది భారతీయుల్లో స్ఫూర్తి నింపిన 'వందేమాతరం' గేయానికి శుక్రవారంతో 150 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమాలను దిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో ఈ రోజు ప్రధాని మోదీ ప్రారంభించారు. వేడుకల్లో భాగంగా ఉదయం బహిరంగ ప్రదేశాల్లో వందేమాతరం గేయాలాపన చేశారు. అన్ని వర్గాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వందేమాతరం గేయాన్ని నవంబరు 7, 1875న బంకించంద్ర ఛటర్జీ రచించారు. ఈ గేయం.. తొలిసారి ఛటర్జీ రాసిన 'ఆనంద్ మఠ్' నవలలో ప్రచురితమైంది. అనంతరం ప్రధాని మోదీ స్మారక స్టాంపు, నాణేన్ని కూడా విడుదల చేశారు.

# స్వల్ప నష్టాల్లో ముగిసిన మార్కెట్లు...

**ఆదుకున్న బ్యాంకింగ్ షేర్లు**

**94 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్**

**17 పాయింట్లు తగ్గిన నిఫ్టీ**

**ఐటీ, ఎఫ్ఎంసీజీ రంగాల్లో అమ్మకాల ఒత్తిడి**

**బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాల్లో కొనుగోళ్ల వెల్లువ**




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. రోజంతా తీవ్ర ఒడిదొడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో, ఆరంభంలో భారీ నష్టాలను చవిచూసిన సూచీలు.. మధ్యాహ్నం తర్వాత బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాల షేర్లలో కొనుగోళ్లు ఊపందుకోవడంతో చాలా వరకు కోలుకున్నాయి. కొన్ని కంపెనీల సానుకూల రెండో త్రైమాసిక ఫలితాలు కూడా మార్కెట్లకు అండగా నిలిచాయి.

ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 94.73 పాయింట్ల నష్టంతో 83,216.28 వద్ద స్థిరపడింది. ఉదయం 83,150.15 వద్ద బలహీనంగా ప్రారంభమైన సెన్సెక్స్, ఒక దశలో 82,670.95 కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఆ తర్వాత కోలుకుని 83,390.11 గరిష్ఠ స్థాయిని కూడా తాకింది. ఇక ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 కూడా 17 పాయింట్ల స్వల్ప నష్టంతో 25,492.30 వద్ద ముగిసింది.

"కీలక మద్దతు స్థాయిల వద్ద కొనుగోళ్లు జరగడంతో దేశీయ ఈక్విటీలు ప్రారంభ నష్టాల నుంచి కోలుకున్నాయి. అయితే మిశ్రమ త్రైమాసిక ఫలితాలు, అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల అమ్మకాల కొనసాగింపు వంటి కారణాలతో ఇది మార్కెట్ ట్రెండ్ మార్పు అని చెప్పడానికి తొందరపాటు అవుతుంది" అని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

ముఖ్యంగా, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితి పెంపు, రంగాల విలీనంపై వస్తున్న ఊహాగానాలతో పీఎస్‌యూ బ్యాంకుల షేర్లలో భారీ ర్యాలీ కనిపించిందని వారు తెలిపారు. భవిష్యత్తులో యూఎస్ షట్‌డౌన్, అమెరికా-భారత్, అమెరికా-చైనా మధ్య టారిఫ్‌లకు సంబంధించిన పరిణామాలను మార్కెట్లు నిశితంగా గమనిస్తాయని వివరించారు.

రంగాల వారీగా చూస్తే నిఫ్టీ ఎఫ్ఎంసీజీ 0.49%, నిఫ్టీ ఐటీ 0.62% నష్టపోయాయి. మరోవైపు నిఫ్టీ ఆటో 0.57%, నిఫ్టీ బ్యాంక్ 0.56%, నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ 0.76% చొప్పున లాభపడ్డాయి.

ప్రధాన షేర్లలో భారతీ ఎయిర్‌టెల్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్, హెచ్‌యూఎల్, ఐటీసీ, ఎస్‌బీఐ, టీసీఎస్ నష్టపోగా.. టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ పోర్ట్స్, ఇన్ఫోసిస్, పవర్‌గ్రిడ్ లాభాలతో ముగిశాయి. బ్రాడర్ మార్కెట్లలో నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.63% లాభపడగా, స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.16% నష్టపోయింది.

## ఆర్‌బీఐ చర్యలతోనే 100 బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి ఎస్‌బీఐ: గవర్నర్




**ముంబై:** ఒకప్పుడు నష్టాల్లో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శుక్రవారం 100 బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి చేరిందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. 2018లో నష్టాల్లో ఉన్న ఎస్‌బీఐ రిజర్వ్ బ్యాంక్ చేపట్టిన పలు సంస్కరణల కారణంగానే ఈ స్థాయికి చేరిందన్నారు. ఈ మేరకు ముంబయిలో ఎస్‌బీఐ బ్యాంకింగ్, ఎనకమిక్స్ కాన్‌క్లేవ్ 2025లో ఆయన మాట్లాడారు.

ఆర్‌బీఐ రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్, కీలక విధానపరమైన నిర్ణయాలే దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేశాయని మల్హోత్రా అన్నారు. ఆర్‌బీఐ తీసుకున్న చర్యలతో రుణ గ్రహీతల్లో క్రమశిక్షణ అలవడడంతో పాటు బ్యాంకుల ఆస్తుల నాణ్యత మెరుగైందన్నారు. ముఖ్యంగా దివాలా చట్టం-2016, కోర్టు వెలుపలి పరిష్కార మార్గాలు వంటివి రుణవిధానాల్లో కీలక మార్పునకు నాంది పలికాయన్నారు.

బ్యాంకింగ్ వ్యవస్థలు తీవ్ర ఒత్తిడిలో ఉన్నప్పుడు సంక్షోభాన్నే అవకాశంగా మలుచుకుని 2014 నుంచి ఆర్‌బీఐ అనేక చర్యలు చేపట్టిందని మల్హోత్రా అన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతానికి దీర్ఘకాలిక చర్యలు చేపట్టినట్లు వివరించారు. దీనికితోడు 27గా ఉన్న పబ్లిక్ సెక్టార్ బ్యాంకులను 2020 నాటికి 12కి తగ్గించడం, బ్యాంకులకు పెద్ద మొత్తంలో మూలధనం సాయం, బ్యాలెన్స్ షీట్లను బలోపేతం చేయడం, ఆరోగ్యకర రుణ వాతావరణం కల్పించడం వంటివీ బ్యాంకింగ్ వ్యవస్థ బలోపేతానికి దోహదం చేశాయన్నారు.

## డాలర్ దెబ్బకు ఇండిగో విలవిల...

**సంస్థ నుంచి సహ వ్యవస్థాపకుడి నిష్క్రమణ!**

**సంస్థ నుంచి దాదాపుగా వైదొలిగిన సహ వ్యవస్థాపకుడు రాకేశ్ గంగ్వాల్**




**న్యూఢిల్లీ:** దేశీయ విమానయాన రంగంలో అగ్రగామిగా ఉన్న ఇండిగో ఎయిర్‌లైన్స్ ప్రస్తుతం రెండు కీలక పరిణామాలతో వార్తల్లో నిలుస్తోంది. తాజాగా ప్రకటించిన త్రైమాసిక ఫలితాల్లో కంపెనీ అనూహ్యంగా నష్టాలను చవిచూడగా, అదే సమయంలో సంస్థ సహ వ్యవస్థాపకుడు రాకేశ్ గంగ్వాల్ తన వాటాలను దాదాపుగా పూర్తిగా విక్రయించి వైదొలిగారు.

వివరాల్లోకి వెళితే, ఇండిగో కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం 9.3 శాతం పెరిగి రూ. 18,555 కోట్లకు చేరుకున్నప్పటికీ, సంస్థ నికర నష్టాలను ప్రకటించింది. దీనికి ప్రధాన కారణం వ్యాపార నిర్వహణలో లోపం కాదు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ భారీగా పడిపోవడమే. ఈ కారణంగా కంపెనీ ఏకంగా రూ. 2,892 కోట్ల ఫారెక్స్ నష్టాన్ని చవిచూసింది. ఈ ఫారెక్స్ ప్రభావాన్ని మినహాయిస్తే, ఇండిగో వాస్తవానికి రూ. 103.9 కోట్ల లాభంతోనే కొనసాగుతోంది.

మరోవైపు, ఇండిగోను ప్రపంచంలోనే అత్యంత సమర్థవంతమైన, లాభదాయకమైన ఎయిర్‌లైన్స్‌లో ఒకటిగా తీర్చిదిద్దిన సహ వ్యవస్థాపకుడు రాకేశ్ గంగ్వాల్ సంస్థ నుంచి నిశ్శబ్దంగా నిష్క్రమించారు. 2021 డిసెంబరులో 36 శాతంగా ఉన్న ఆయన వాటా, అక్టోబర్ 2025 నాటికి 5 శాతం కంటే దిగువకు పడిపోయింది. ఒక్క 2025లోనే ఆయన రెండు భారీ విక్రయాలు జరిపారు. మే నెలలో రూ. 6,800 కోట్లు, ఆగస్టులో రూ. 7,020 కోట్ల విలువైన వాటాలను అమ్మేశారు. ఈ మొత్తం నిష్క్రమణ ప్రయాణంలో ఆయన రూ. 45,000 కోట్లకు పైగా ఆర్జించినట్లు అంచనా.

# వరల్డ్‌కప్ విజేతలపై కాసుల వర్షం..





**2.5 కోట్లతో అభినందించిన మహారాష్ట్ర సీఎం..**

**ముంబై:** మహిళల వరల్డ్ కప్ ఛాంపియన్లకు రాష్ట్ర ప్రభుత్వాలు నీరాజనాలు పలుకుతున్నాయి. అద్భుత ప్రదర్శనతో యావత్ దేశం గర్వించేలా చేసిన భారత స్టార్లకు ఘన స్వాగతం లభిస్తోంది. ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి స్వరాష్ట్రం చేరుకుంటున్న క్రికెటర్లకు ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఘనంగా స్వాగతం పలుకుతున్నారు. మహారాష్ట్రకు చెందిన స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, రాధా యాదవ్‌లను శుక్రవారం సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సత్కరించారు. తన నివాసం వర్షా బంగళాలో ఆయన ఈ ముగ్గురిని నగదు బహుమతితో అభినందించారు.

భారత మహిళల జట్టు దశాబ్దాల కల సాకారమవ్వడంలో కీలకంగా వ్యవహరించిన మంధాన, జెమీమా, రాధాలను సీఎం ఫడ్నవీస్ ప్రత్యేకంగా ప్రశంసించారు. తమ అద్భుత ఆటతో వరల్డ్ ఛాంపియన్స్‌గా అవతరించిన ఈ ముగ్గురికి పుష్పగుచ్ఛం ఇచ్చి.. శాలువాలు కప్పి సత్కరించారు. అంతేకాదు తలా రూ. 2.5కోట్ల చెక్కును ప్రదాన చేశారు సీఎం. కోచ్ అన్మోల్ మజుందార్‌కు రూ. 2.5లక్షల చెక్కున ముఖ్యమంత్రి అందజేశారు.

టీమిండియా చరిత్ర సృష్టించడంలో భాగమైన బౌలింగ్ కోచ్ ఆవిష్కర్ సాల్వీ, సహాయక సిబ్బంది, సెలెక్టర్లు డయాని ఎడుల్జీ, విశ్లేషకుడు అనిరుద్ధ దేశ్‌పాండేలను సీఎం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్, క్రీడా శాఖ మంత్రి మాణిక్‌రావు కొకటే, సాంస్కృతిక శాఖామాత్యులు అశిష్ షెలార్, ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్ ఖండరే, తదితరులు పాల్గొన్నారు. ఈ సన్మాన కార్యక్రమానికి జెమీమా కుటుంబ సమేతంగా హాజరైంది.

వరల్డ్ కప్ విజయంతో భారత్‌లో మహిళల క్రికెట్ మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పింది జెమీమా. తమను సన్మానించి, నగదు ప్రోత్సాహం అందించిన సీఎంకు ఆమె కృతజ్ఞతలు తెలిపింది. 2011లో సచిన్ టెండూల్కర్ వరల్డ్ కప్ విజేతగా బాంద్రాకు వచ్చిన రోజులను తను గుర్తు చేసుకుంది. 'వరల్డ్ కప్ ట్రోఫీ గెలుపొందిన తర్వాత బాంద్రాలోని సచిన్ ఇల్లు సందర్శకులతో కిటకిటలాడింది. మా ఇల్లు పక్కనే కావడంతో బాల్కనీ నుంచి సచిన్‌ను చూశాను. ఆయన కారు కూడా కదలేనంతగా జనం పోగయ్యారు. అప్పుడు నాకు 11 ఏళ్లు. ఆ సమయంలోనే నేను వరల్డ్ కప్ ఛాంపియన్ అవ్వాలని నిర్ణయించుకున్నా. నా కల నిజమైనందుకు చాలా సంతోషంగా ఉంది' అని జెమీమా వెల్లడించింది. ఆస్ట్రేలియాతో జరిగిన సెమీ ఫైనల్లో అజేయం శతకం(127 నాటౌట్)తో జట్టుకు విజయాన్ని అందించింది జెమీమా.

## టీమిండియా పేసర్ మహ్మద్ షమీకి నోటీసులు జారీ చేసిన సుప్రీంకోర్టు

**కోల్‌కతా:** టీమిండియా స్టార్ పేసర్ మహ్మద్ షమీ, ఆయన భార్య హసీన్ జహాన్‌ల మధ్య కొనసాగుతున్న భరణం వివాదం మరోసారి వార్తల్లోకి ఎక్కింది. భరణం మొత్తాన్ని పెంచాలని కోరుతూ హసీన్ జహాన్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌కు సంబంధించి మహ్మద్ షమీతో పాటు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి కూడా సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా దీనిపై స్పందన తెలియజేయాలని ఆదేశించింది.




గతంలో కలకత్తా హైకోర్టు, హసీన్ జహాన్‌కు నెలకు రూ. 1.5 లక్షలు, వారి కుమార్తె సంరక్షణ కోసం రూ. 2.5 లక్షలు భరణంగా చెల్లించాలని షమీని ఆదేశించింది. అయితే, ఈ మొత్తం తమ అవసరాలకు సరిపోవడం లేదని, భరణాన్ని మరింత పెంచాలని కోరుతూ హసీన్ జహాన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆమె పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం, తాజాగా ఈ నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల తర్వాత ఈ కేసుపై తదుపరి విచారణ జరగనుంది.

మహ్మద్ షమీ, హసీన్ జహాన్‌ల మధ్య 2018 నుంచి వ్యక్తిగత, న్యాయపరమైన వివాదాలు నడుస్తున్న విషయం తెలిసిందే. అప్పట్లో షమీపై మ్యాచ్ ఫిక్సింగ్, గృహ హింస, వరకట్న వేధింపుల వంటి తీవ్రమైన ఆరోపణలు చేస్తూ హసీన్ జహాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలతో షమీపై క్రిమినల్ కేసు కూడా నమోదైంది. అయితే, మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణల నుంచి బీసీసీఐ అతనికి క్లీన్ చిట్ ఇచ్చినప్పటికీ, వారి మధ్య వ్యక్తిగత వివాదాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి.

గతంలో తన వివాహం గురించి అడిగినప్పుడు షమీ స్పందిస్తూ.. "గడిచిపోయిన దాని గురించి నేను చింతించను. ఎవరినీ నిందించాలని అనుకోవడం లేదు. నా పూర్తి దృష్టి నా క్రికెట్‌పైనే ఉంటుంది. నాకు ఈ వివాదాలు వద్దు" అని వ్యాఖ్యానించాడు. తాజా సుప్రీంకోర్టు నోటీసులతో వీరి వివాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

## వీడ్కోలు వార్తలకు చెక్.. ఐపీఎల్‌కు రెఢీ అవుతున్న ధోనీ..!

**చెన్నై:** ఐపీఎల్ అభిమానులకు గుడ్‌న్యూస్. వచ్చే సీజన్‌లో మహేంద్ర సింగ్ ధోనీ ఆడుతాడా? లేదా? అనే వార్తలకు ఎండ్‌కార్డ్ పడింది. ఫ్రాంచైజీ క్రికెట్‌లో రారాజుగా వెలుగొందుతున్న మహీ భాయ్ మరో సీజన్‌కు సన్నద్ధమవుతున్నాడు. శరీరం సహకరిస్తే మరో సీజన్ ఆడుతానని ఇదివరకే ప్రకటించిన ధోనీ.. మరోమారు పసుపు జెర్సీతో స్టేడియాలను దద్దరిల్లేలా చేయనున్నాడు. అవును.. ధోనీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయాన్ని క్రిక్‌బజ్‌తో చెన్నై సూపర్ కింగ్స్ సీఈఓ కాశీ విశ్వనాథన్ పంచుకున్నాడు. మీరు విన్నది నిజమే. ఐపీఎల్ 19వ సీజన్‌లో ధోనీ ఆడుతున్నాడు అని ఆయన తెలిపాడు.భారత కెప్టెన్‌గానే కాకుండా ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో తనదైన ఆటతో అభిమానుల గుండెల్లో నిలిచిన ధోనీ.. వీడ్కోలు వార్తలకు చెక్ పెట్టాడు. మరో సీజన్‌కు నేను రెఢీ అంటూ తనపై కొండంత ప్రేమ కురిపిస్తున్న చెన్నై సూపర్ కింగ్స్, సీఎస్కే ఫ్యాన్స్‌ను సంబురాల్లో ముంచెత్తాడీ వెటరన్. శుక్రవారం 'క్రిక్‌బజ్'తో మాట్లాడిన సీఎస్కే సీఈఓ కాశీ విశ్వనాథన్ అమితానందంతో ఈ విషయాన్ని బహిర్గతం చేశాడు. 'వచ్చే సీజన్‌లో ఆడేందుకు నేను సిద్ధంగా ఉన్నాను అని ధోనీ మాతో చెప్పాడు. అతడి నిర్ణయం పట్ల చాలా సంతోషంగా ఉన్నాం. అనుభవజ్ఞుడైన ధోనీ యువతరానికి మార్గనిర్దేశనం చేయడంలో కీలకం కానున్నాడు' అని విశ్వనాథన్ పేర్కొన్నాడు. ఈ సందర్భంగా



సంజూ శాంసన్‌ను రాజస్థాన్ రాయల్స్ నుంచి కొనడంపై గురించి చర్చలు జరుగుతున్నాయని విశ్వనాథన్ తెలిపాడు. నవంబర్ 10, 11వ తేదీల్లో సీఎస్కే యాజమాన్యం, కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌తో ధోనీ సమావేశం అవుతాడని సమాచారం. సీఎస్కే భవిష్యత్ గురించి.. వేలంలో కొనాల్సిన ఆటగాళ్ల గురించి చర్చించే అవకాశముందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.

**234 మ్యాచ్‌లు.. 4,865 పరుగులు**

పద్దెనిమిదో ఎడిషన్ ముందు కెప్టెన్సీ వదులుకున్న ధోనీ.. సీజన్ మధ్యలో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఎడమచేతి బొటనవేలి గాయంతో టోర్నీకి దూరమయ్యాడు. దాంతో, మళ్లీ సీఎస్కే సారథ్యాన్ని చేపట్టిన తాల.. కుర్రాళ్లో ఆత్మవిశ్వాసం నింపుతూ జట్టులో స్ఫూర్తి రగిలించాడు.

# మొహ్సిన్ నఖ్వీ ద్వంద్వ పాత్ర..

**ఫిర్యాదు చేయనున్న బీసీసీఐ..**

**అదే జరిగితే ఏసీసీకి కొత్త ఛైర్మన్..!**

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ ముగిసి దాదాపు ఆరువారాలు గడిచింది. ఇంకా ట్రోఫీని ఏసీసీ భారత జట్టుకు అప్పగించలేదు. సెప్టెంబర్ 28న సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని భారత జట్టు దుబాయి ఇంటర్‌నేషనల్ స్టేడియంలో జరిగిన ఫైనల్‌లో పాక్‌ను ఐదు వికెట్ల తేడాత ఓడించి.. తొమ్మిదోసారి ఆసియా కప్ టైటిల్‌ను సాధించింది. అయితే, మ్యాచ్ తర్వాత ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నది. క్రికెట్ ప్రపంచాన్ని షాక్‌కు గురి చేశాయి. పీసీబీ ఛైర్మన్, పాక్ మంత్రి మొహ్సిన్ నఖ్వీ నుంచి ట్రోఫీని అందుకునేందుకు భారత జట్టు నిరాకరించింది.

దాంతో ఏసీసీ అధ్యక్షుడుగా నఖ్వీ తానే ట్రోఫీని ఇస్తానని భీష్మించారు. టీమిండియా అందుకు నిరాకరించడంతో ఆయన ట్రోఫీని హోటల్‌కు తీసుకు వెళ్లడం వివాదాస్పదమైంది. అయితే, నఖ్వీ ద్వంద్వ పాత్ర వివాదానికి దారి తీసింది. టెలికాం ఆసియా స్పోర్ట్స్‌లోని ఓ నివేదిక ప్రకారం.. దుబాయిలో జరుగనున్న ఐసీసీ క్రికెట్ బోర్డు సమావేశంలో బీసీసీఐ మొత్తం సమస్యను లేవనెత్తబోతున్నది. మొహ్సిన్ నఖ్వీపై ఆరోపణల జాబితాను బీసీసీఐ సిద్ధం చేసింది. ఆయన అనర్హతను ప్రశ్నించే తీర్మానాన్ని ప్రవేశపెట్టబోతోందని నివేదిక పేర్కొంది. ప్రభుత్వ పదవి, క్రీడా పరిపాలన పదవి రెండింటిని ఒకేసారి కలిగి ఉ ఒడడం ఐసీసీ నిబంధనలను ఉల్లంఘించడమేనని బీసీసీఐ పేర్కొంటున్నది.




అయితే, ఆసియా కప్ ట్రోఫీ అప్పగింతపై ఇంకా పరిస్థితి అస్పష్టంగానే ఉన్నది. ఈ విషయంపై ఇప్పటికే ఏసీసీకి అధికారిక లేఖ పంపామని.. ఇప్పటి వరకు స్పందన రాలేదని బీసీసీఐ దేవజిత్ సైకియా ఇటీవల వెల్లడించారు. శుక్రవారం జరిగే ఐసీసీ బోర్డు సమావేశంలో బీసీసీఐ అధికారికంగా ఈ విషయాన్ని లేవనెత్తుతుందని పలు నివేదికలు తెలిపాయి. ట్రోఫీని పంపడంలో ఆలస్యంపై బోర్డు తీవ్రంగా పరిగణిస్తున్నది. ఇది క్రీడా స్ఫూర్తికి విరుద్ధమని.. సంస్థాగత పారదర్శకతకు విరుద్ధంగా ఉందని సైకియా పేర్కొన్నారు. పాకిస్తాన్ సైనిక చర్యలు ముగ్గురు ఆఫ్ఘన్ దేశీయ క్రికెటర్లు మరణించిన తర్వాత పాక్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య సంబంధాలు ఇటీవల క్షీణించాయి. తర్వాత పాక్‌లో జరుగనున్న ముక్కోణపు సిరీస్‌లో ఆఫ్ఘనిస్తాన్ వైదొలిగింది.

ఆసియా కప్ ముగిసిన తర్వాత భారత జట్టు మైదానంలోనే ఉ ఒడిపోయింది. కప్ లేకుండానే సంబరాలు చేసుకుంది. ట్రోఫీని అందించేందుకు నఖ్వీ వేదికపై చేరుకున్న సమయంలో భారత ఆటగాళ్లు స్పందించలేదు. దాంతో నఖ్వీ ట్రోఫీతో హోటల్‌కు వెళ్లిపోయాడు. ఆ తర్వాత టీమిండియా ట్రోఫీ, మెడల్స్ లేకుండానే భారత్‌కు వచ్చింది. ఇలా జరుగడం క్రికెట్ చరిత్రలోనే తొలిసారి. భారత్-పాక్ క్రికెట్ సంబంధాలు మరింత దెబ్బతీయడమే కాకుండా.. ఆసియా క్రికెట్ కౌన్సిల్ విశ్వసనీయతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తాజాగా ఐసీసీ బోర్డు సమావేశం జరుగుతుండడంతో బీసీసీఐ అధికారికంగా ఈ సమస్యను లేవనెత్తనున్నది. ఈ అంశం ఆసియా కప్ ట్రోఫీని తిరిగి ఇవ్వడంతో పాటు మొహ్సిన్ నఖ్వీ ద్వంద పాత్రలపై సైతం దృష్టి సారించే అవకాశం ఉంది. ఐసీసీ తీవ్రంగా పరిగణిస్తే రాబోయే రోజుల్లో ఏసీసీలో కీలక మార్పులు జరుగనున్నాయి.



# అనసూయ త్రీసమ్ రొమాంటిక్ సాంగ్!?



టాకీస్: ఒక్కసారిగా అనసూయ మళ్ళీ హాట్ టాపిక్ అయింది. అందుకు ప్రధాన కారణం ఓ వీడియో సాంగ్. ప్రభుదేవా, రాయ్ లక్ష్మీ, అనసూయ భరద్వాజ్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'వోల్ఫ్' మళ్లీ వార్తల్లో నిలిచింది. 2023 ఆగస్టులో టీజర్‌ను విడుదల చేసిన ఈ చిత్ర బృందం, ఇన్నాళ్ల విరామం తర్వాత తాజాగా ఓ కొత్త అప్డేట్ ఇచ్చింది. తాజాగా విడుదలైన "సాసా సాసా" అనే తమిళ లిరికల్ వీడియో సాంగ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.ఈ పాటలో ప్రభుదేవా తన సొగసైన డ్యాన్స్ మూవ్స్‌తో ఆకట్టుకుంటూ కనిపిస్తారు. ఓ ఇంట్లో ఒంటరిగా ఉన్న హీరో జీవితంలో ముగ్గురు అందమైన యువతులు ఒక్కొక్కరిగా ప్రవేశించడం, వారంతా చాటుగా మొబైల్‌లో వీడియోలు తీయడం, హీరోను ఆటపట్టించడం వంటి రొమాంటిక్ సన్నివేశాల మధ్య ఈ పాట సాగుతుంది. మెలోడీకి తోడు స్టైలిష్ విజువల్స్, ప్రభుదేవా ఎనర్జిటిక్ డ్యాన్స్ ఫ్యాన్స్‌కి స్పెషల్ ట్రీట్‌గా మారాయి. ఇప్పటికే ఈ త్రీసమ్ రొమాంటిక్ సాంగ్ యువతలో విపరీతంగా వైరల్ అవుతోంది. ప్రెజెంటేషన్‌లో ఉన్న క్లాస్ టచ్, సంగీతంలో ఉన్న మోడర్న్ బీట్‌లు ప్రేక్షకులను ఆకర్షిస్తున్నాయి. అయితే అనసూయ భరద్వాజ్ ఇలాంటి సాంగ్‌లో నటించడం కొంతమందిని ఆశ్చర్యపరిచింది. ఆమె ఓ తాంత్రికురాలి పాత్రలో కనిపించబోతున్నారని, ఆ రోల్ హర్రర్%-%రోమాన్స్ మిక్స్‌గా ఉంటుందని సమాచారం. అయినా, నెటిజన్లు "ఇలాంటి పాత్రలో అనసూయ ఎందుకు నటించింది?" అంటూ సోషల్ మీడియాలో విభిన్న కామెంట్లు చేస్తున్నారు. కొంతమంది ఆమెపై వ్యంగ్యంగా ట్వీట్లు చేస్తుండగా, మరికొందరు మాత్రం ఆమె కొత్త ప్రయోగాన్ని మెచ్చుకుంటున్నారు. ఏదేమైనా, "సాసా సాసా" పాటతో ఈ సినిమా మీద మళ్లీ చర్చ మొదలైంది.వినూ వెంకటేష్ దర్శకత్వంలో రూపొందిన 'వోల్ఫ్' చిత్రం ప్రభుదేవా కెరీర్‌లో 60వ సినిమాగా నిలవబోతోంది. సందేశ్ నాగరాజు, సందేశ్ ఎన్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే తమిళంతో పాటు తెలుగు మరియు ఇతర భాషల్లో విడుదల కానుంది.



# పవన్ కళ్యాణ్‌తో 'బ్రో 2'..

## పవన్ కళ్యాణ్ గ్రీన్ సిగ్నలే తరువాయి..

**టాకీస్:** పవన్ కళ్యాణ్, సాయి దుర్గ తేజ్ నటించిన 'బ్రో' సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయం సాధించలేదు. అయినప్పటికీ, దర్శకుడు సముద్రఖని 'బ్రో 2' తీయడానికి సిద్ధంగా ఉన్నానని, పవన్ కళ్యాణ్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే సినిమా పట్టాలెక్కుతుందని ప్రకటించారు. ఈ వార్త పవన్ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. 'ఓజీ 2' వంటి భారీ ప్రాజెక్టులున్న నేపథ్యంలో 'బ్రో 2' అవసరమా అని చర్చలు మొదలయ్యాయి.పవన్ కళ్యాణ్, సాయి దుర్గ తేజ్ కాంబినేషన్‌లో వచ్చిన ఫాంటసీ కామెడీ సినిమా 'బ్రో'. ఇది మామా అల్లుళ్లు కలిసి నటించిన ఫస్ట్ మూవీ. 'వినోదయ సితం' అనే తమిళ సినిమాకి ఇది రీమేక్. మాతృకను డైరెక్ట్ చేసిన సముద్రఖని.. కొన్ని మార్పుల చేర్పులతో తెలుగులో తెరకెక్కించారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ దీనికి స్క్రీన్ ప్లే అందించారు. 2023 జులై నెలాఖరున రిలీజైన ఈ సినిమా.. బాక్సాఫీస్ దగ్గర నిరాశ పరిచింది. పవర్ స్టార్ అభిమానులకు కూడా ఈ సినిమా నచ్చలేదు. అందుకే కలెక్షన్స్ రాలేదు. అయితే అలాంటి చిత్రానికి సీక్వెల్ చేయడానికి స్క్రిప్ట్ రెడీ అయింది.అవును.. మీరు విన్నది నిజమే. 'బ్రో 2' సినిమా చేయడానికి డైరెక్టర్ కమ్ యాక్టర్ సముద్రఖని సిద్ధంగా ఉన్నారు. తమిళంలో తీస్తారో లేదో తెలియదు కానీ.. తెలుగులో మాత్రం పవన్ కళ్యాణ్ తోనే ఈ సీక్వెల్ తీయాలని ఫిక్స్ అయిపోయారు. దీనికి కథ కూడా సిద్ధంగానే ఉంది. పవన్ ఎప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇస్తే, అప్పుడు సినిమాని పట్టాలెక్కించాలని చూస్తున్నారు. ఈ విషయాన్ని సముద్రఖని స్వయంగా మీడియా ముఖంగా వెల్లడించారు. 'బ్రో' మూవీకి సీక్వెల్ ఉంటుందని కన్ఫామ్ చేశారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే, సముద్రఖని, రానా దగ్గుబాటి ప్రధాన పాత్రలు పోషించిన 'కాంత' సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ప్రమోషన్స్‌లో భాగంగా గురువారం హైదరాబాద్ లో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. దీనికి దుల్కర్, రానా, భాగ్యశ్రీ లతో పాటు సముద్రఖని కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా 'బ్రో 2' మూవీ ప్రస్తావన వచ్చింది. దీనిపై సముద్రఖని స్పందిస్తూ.. "బ్రో 2' స్క్రిప్ట్ రెడీగా ఉంది. అన్నగారు సిగ్నల్ ఇస్తే టేకాఫ్ అవుతుంది" అని అన్నారు.బ్రో 2' సినిమా స్క్రిప్ట్ రెడీ అని సముద్రఖని ప్రకటించడంతో పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అంతా ఒక్కసారిగా సర్‌ప్రైజ్ అయ్యారు. ఒకింత షాక్ అయ్యారని చెప్పాలి. ఎందుకంటే ఇది వారు ఊహించని అప్డేట్. 'బ్రో' కమర్షియల్ గా పెద్దగా వర్కౌట్ కాలేదన్నది ఓపెన్ సీక్రెట్. ఏదో పవర్ స్టార్ ఇమేజ్, స్టార్ డమ్ కారణంగా మంచి ఓపెనింగ్స్ వచ్చాయి. కానీ కంటెంట్ పరంగా చూసుకుంటే మాత్రం సాధారణ ప్రేక్షకులతో పాటుగా అభిమానులని కూడా అంతగా మెప్పించలేక పోయింది. అసలు ఆల్రెడీ ఓటీటీలో తెలుగులో అందుబాటులో ఉన్న ఈ రీమేక్ సినిమా పవన్ చేయడంపై అప్పట్లోనే చాలామంది ఫ్యాన్స్ పెదవి విరిచారు. పవన్ కళ్యాణ్ ఈ మధ్యనే 'ఓజీ' సినిమాతో తన కెరీర్ లోనే బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ అందుకున్నారు. 'ఉస్తాద్ భగత్ సింగ్' మూవీ రిలీజుకు రెడీ అవుతోంది. సుజీత్ డైరెక్షన్ లో ఓజీకి ప్రీక్వెల్, సీక్వెల్ ఉంటాయని ఇప్పటికే ప్రకటించారు. ఓజీ యూనివర్స్ కోసం వెయిటింగ్ అని పవన్ స్వయంగా చెప్పారు. ఇలాంటి క్రేజీ ప్రాజెక్ట్స్ కోసం అభిమానులు ఎదురు చూస్తుంటే, మధ్యలో 'బ్రో 2' లాంటి సినిమా అవసరమా? అని సోషల్ మీడియాలో అప్పుడే డిస్కషన్ మొదలైంది. సముద్రఖని 'బ్రో'కి సీక్వెల్ కాకుండా, ఏదైనా వేరే ఇతర కథతో సినిమా ప్లాన్ చేస్తే బాగుంటుందని ఫ్యాన్స్ సూచిస్తున్నారు. అయినా ఫస్ట్ పార్ట్ ఆశించిన సక్సెస్ సాధించినప్పుడు, దానికి పార్ట్-2 తీయడమేంటో అంటూ పలువురు సెటైర్లు వేస్తున్నారు.



# 'కథనార్' నుంచి ఫస్ట్ లుక్ విడుదల

## మలయాళంలో ఎంట్రీ ఇస్తున్న అనుష్క..

టాకీస్: టాలీవుడ్ భామ అనుష్క శెట్టి మలయాళం ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వబోతున్న సంగతి తెలిసిందే. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం కథనార్. ఈ సినిమాకు రోజిన్ థామస్ దర్శకత్వం వహిస్తుండగా.. ప్రముఖ నిర్మాత గోకులం గోపాలన్ నిర్మిస్తున్నాడు. హారర్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం రాబోతుండగా.. ఈ చిత్రంలో జయసూర్య, ప్రభుదేవ, ప్రేమదేశం వినీత్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. అయితే నేడు అనుష్క శెట్టి పుట్టినరోజు సందర్భంగా ఆమెకి శుభాకాంక్షలు తెలుపుతూ చిత్రబృందం అనుష్క ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది. ఈ చిత్రంలో అనుష్కా నీలా అనే పాత్రలో కనిపించబోతున్నట్లు ప్రకటించింది.




# ఏకే 64లో లారెన్స్, విజయ్ సేతుపతి?





**టాకీస్:** తమిళ స్టార్ హీరో అజిత్ కుమార్ నటిస్తున్న తాజా యాక్షన్ చిత్రం 'ఏకే 64' గురించి మరో కీలక అప్డేట్ బయటకు వచ్చింది. ఆదిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా భారీ ప్రాజెక్ట్ కోసం గణనీయమైన బడ్జెట్‌ను కేటాయించినట్లు తెలిసింది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో అజిత్‌తో పాటు మరో ఇద్దరు స్టార్ హీరోలు కూడా కీలక పాత్రల్లో నటించబోతున్నారు.వారు విజయ్ సేతుపతి,రాఘవ లారెన్స్. అయితే వీరిద్దరూ ప్రతినాయకులుగా నటిస్తున్నారా? లేక అజిత్‌కు అండగా నిలిచే శక్తివంతమైన పాత్రల్లో వస్తారా?అన్నది చిత్రయూనిట్ ఇంకా వెల్లడించలేదు. కానీ ఇండస్ట్రీ వర్గాల మాటల ప్రకారం, వీరి రోల్స్ మల్టీ-డైమెన్షనల్‌గా ఉండనున్నాయని,కేవలం ప్రతినాయక పాత్రలుగా మాత్రమే కాకుండా కథలో ప్రధాన మలుపులకు కారణమవుతారని సమాచారం. ఇటీవల 'వాలిమై', 'వీర్‌మా', 'తునివు', 'గుడ్ బ్యాడ్ అగ్లీ' వంటి సినిమాలతో వరుస హిట్లు అందుకున్న అజిత్ ఈసారి మరింత స్టైలిష్, మాస్, అలాగే ఎమోషన్ కలగలిపిన పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామాను ఎంచుకున్నారని తెలుస్తోంది. జనవరిలో ఈ సినిమా సంబంధించిన పూర్తి వివరాలను అధికారికంగా ప్రకటిస్తామని అజిత్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ సినిమాకి దేశంలోనే అగ్రశ్రేణి టెక్నీషియన్లు, యాక్షన్ మాస్టర్లు, డీఓపీలు కలిసి పనిచేస్తున్నట్లు సమాచారం. అలాగే ఈ ప్రాజెక్ట్ కోసం అజిత్ తన కెరీర్‌లోనే అత్యధిక పారితోషికం తీసుకుంటున్నారని కోలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇక రాఘవ లారెన్స్ ప్రస్తుతం 'కాంచన 4' షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. పూజా హెగ్డే, నోరా ఫతేహి కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే పాజిటివ్ టాక్‌ను సంపాదించుకుంది. మరోవైపు విజయ్ సేతుపతి బాలీవుడ్, కోలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీలలో వరుస సినిమాలతో శరవేగంగా దూసుకెళ్తున్నారు. 'ఏకే 64' లో అజిత్, విజయ్ సేతుపతి, రాఘవ లారెన్స్ ఒకే తెరపై కనిపిస్తే.. అది కేవలం కోలీవుడ్‌కే కాదు, పాన్ ఇండియా స్థాయిలోనే అత్యంత భారీ, క్రేజీ కాంబినేషన్ గా నిలుస్తుందని సినీ విశ్లేషకుల అభిప్రాయం.

# భూత వేటగాడిగా ఆకట్టుకున్న సుధీర్ బాబు



**టాకీస్:** సుదీర్ బాబు, సొనాక్షి సిన్హా నటించిన 'జటాధర' సినిమాపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ధన పిశాచిని పాత్రలో సొనాక్షి చేసిన నటన ఈ చిత్రానికి ప్రధాన హైలైట్‌గా నిలిచిందని ప్రేక్షకులు అంటున్నారు. భూత వేటగాడిగా సుదీర్ బాబు తీవ్రతతో కూడిన ప్రదర్శనను అందించి ఆకట్టుకున్నారు. కథలో పౌరాణికత, భావోద్వేగం, భయం సమతూకంగా మిళితమైందని, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమా వాతావరణాన్ని మరింత బలవంతం చేసిందని స్పందనలు వెల్లువెత్తుతున్నాయి. సినిమా పూర్తయ్యాక కూడా కథ ఇమేజ్ మైండ్‌లో నిలిచిపోతుందని నెటిజన్లు పేర్కొంటున్నారు. థియేటర్‌లో చూస్తూనే ఈ అనుభూతిను ఎక్స్‌పీరియన్స్ చేయగలరని అంటున్నారు.సుధీర్ బాబు హీరోగా, బాలీవుడ్ బ్యూటీ సొనాక్షి సిన్హా కీలక పాత్రలో నటించిన సూపర్ నేచురల్ మైథలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ ' జటాధర '. వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ సంయుక్తంగా దర్శకత్వం వహించిన ఈ చిత్రం తెలుగు, హిందీ భాషల్లో శుక్రవారం (నవంబర్ 7) ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఘోస్ట్ హంటింగ్, బ్లాక్ మ్యాజిక్, మైథలాజికల్ ఎలిమెంట్స్ అన్నీ కలగలిపి ఈ చిత్రాన్ని తీసినట్లు ప్రమోషన్లలో మేకర్స్ చెబుతూ వచ్చారు. సుధీర్‌బాబు నటన బ్యాలెన్స్‌గా ఉంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.